PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 247 | విజయవాడ, సోమవారం 10 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 10 April 2023 | Rs



వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడితే వినియోగం తగ్గుతుందా?

● లోపలి పేజీలో.. ●



రింకూ 'సింగం'

- ఛేదనలో సంచలన ఇన్నింగ్స్
- రషీద్ ఖాన్ హ్యాట్రిక్ వృథా
- టైటాన్స్‌పై నైట్‌రైడర్స్ గెలుపు

● లోపలి పేజీలో.. ●



సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

మోడీని గద్దె దింపితేనే దేశానికి రక్ష

కమ్యూనిస్టు ఉద్యమానికి పూర్వవైభవం తీసుకురావాలి

సిపిఎం, సిపిఐ ఉమ్మడి సమావేశంలో సీతారాం ఏచూరి, డి రాజా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్య, లౌకిక పునాదులకే ప్రమాదంగా మారిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీని గద్దె దింపితేనే దేశాన్ని పరిరక్షించుకోగలమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం లౌకిక, ప్రగతిశీల శక్తులను ఏకం చేసే ప్రధాన బాధ్యత కమ్యూనిస్టులపైనే ఉందని పేర్కొన్నారు. సమస్యలపై బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మిస్తూనే, బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఆయా రాష్ట్రాల్లో పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రారంభించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన సిపిఎం, సిపిఐ ఉమ్మడి సమావేశానికి ముఖ్య అతిథులుగా సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరయ్యారు. ఆయా పార్టీల రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు అధ్యక్షవర్గంగా జరిగిన ఈ సమావేశానికి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరయ్యారు.

ఈ సమావేశంలో సీతారాం ఏచూరి మాట్లాడుతూ కమ్యూనిస్టుల ఐక్యత అవసరమని, ఇందుకు ముందడుగు వేసిన రెండు పార్టీల రాష్ట్ర కార్యదర్శులకు అభినందనలు తెలిపారు. కమ్యూనిస్టులు ఐక్యంగా మతోన్మాద బిజెపిని అడ్డుకోవాలని, ఆర్ఎస్ఎస్-బిజెపి కూటమి కుట్రల పట్ల ప్రజలను చైతన్య పర్చాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వరంగ ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెడుతూ వారికి వేల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం... రైతులకు రుణాలు మాఫీ చేయడంలేదని అన్నారు. బిజెపి విధానాలతో దేశంలో అసమానతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. నిరుద్యోగ సమస్య తీవ్రతరమైందని, అధిక ధరలతో సామాన్యుల జీవితాలు ఆగమయ్యాయని అన్నారు. దేశంలో బిజెపియేతర ప్రభుత్వాలను కూల్చేందుకు

మిగతా 2లో

ఇమ్యూనిటీ తక్కువ కావడం వల్లే

ఇండియాలో వేరియంట్ల వ్యాప్తి

- డబ్ల్యుహెచ్ఓ రీజినల్ డైరెక్టర్

న్యూఢిల్లీ : భారత ప్రజల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్లే కొత్త కోవిడ్ వేరియంట్లు వ్యాప్తి చెందుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ రీజినల్ డైరెక్టర్ (ఆగ్నేయాసియా) డాక్టర్ పూనమ్ క్షేత్రపాల్‌సింగ్ అభిప్రాయపడ్డారు. వీటికి అడ్డుకట్ట వేయాలంటే వ్యాధులపై నిఘా వేసి ఉంచడం, ప్రజలకు అధిక సంఖ్యలో వ్యాక్సిన్లు ఇవ్వడం వంటి చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రజలందరూ బూస్టర్ డోసు వేసుకోవాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలని కోరారు. పలు దేశాల్లో ఇన్‌ఫెక్షన్లు పెరుగుతున్నప్పటికీ ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య పెద్దగా ఉండటం లేదని చెప్పారు. వైరస్ కారణంగా కొత్త వేరియంట్లు పుట్టుకొస్తున్నాయని, పరిస్థితి గతంలో మాదిరిగా ఉండదని తెలిపారు. అయినప్పటికీ ప్రమాదాన్ని తక్కువగా అంచనా వేయకూడదని హెచ్చరించారు. కోవిడ్, ఇతర శ్వాసకోశ వ్యాధుల నివారణకు దీర్ఘకాలిక చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. పిల్లలపై ఇన్‌ఫెక్షన్ ప్రభావం పెద్దగా ఉండదని చెప్పారు. వీరికి వ్యాక్సిన్ అందించే విషయంపై ఆయా దేశాలు నిర్ణయం తీసుకోవాలన్నారు. దేశంలో ప్రస్తుతం కోవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2022 ప్రారంభంలో వచ్చిన కోవిడ్ వేరియంట్ ఒమిక్రాన్ సమయంలో నమోదైన కేసుల సంఖ్యకు సమానంగా ప్రస్తుతం వస్తున్నాయి. దేశంలో శనివారం కొత్తగా 6,155 కేసులు వెలుగు చూశాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 31,194కు చేరిందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గతేడాది సెప్టెంబర్ 16 తర్వాత రోజువారీ కేసుల సంఖ్య ఆరు వేలు దాటింది. కోవిడ్ బారినపడి శనివారం 14 మంది చనిపోయారు. వీరిలో మహారాష్ట్రలో ముగ్గురు, కర్ణాటక, రాజస్థాన్‌లో ఇద్దరు చొప్పున, ఢిల్లీ, హర్యానా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, పంజాబ్, కేరళలో ఒక్కొక్కరు ఉన్నారు.

3.15 లక్షల పోస్టులు ఖాళీ

రైల్వేలో ఏటా పెరిగిపోతున్న వేకెన్సీలు

- మూడేళ్లలో 1.41 లక్షల మంది ఉద్యోగ విరమణ
- ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి పోస్టుల భర్తీలోనూ నిర్లిప్తతే

పట్టాలెక్కని నియామకాలు

ప్రధాన జోన్లలో ఖాళీలు ఇలా

ఈశాన్య రైల్వే - 38,754
పశ్చిమ రైల్వే - 36,476
ఉత్తర రైల్వే - 30,141
మధ్య రైల్వే - 28650

నాన్ గెజిటేడ్ 3,12,895
ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి 18,670
గెజిటేడ్ 2,885

మొత్తం ఖాళీలు 3.15 లక్షలు

నియామకాల తీరు

2019-20	1,37,632
2020-21	5744
2021-22	4666



న్యూఢిల్లీ : డబుల్ ఇంజిన్..డబుల్ ఇంజిన్..అంటూ ఎన్నికల సభల్లో ఊకదంపుడు ప్రసంగాలు దట్టించే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పనితీరు బొగ్గు ఇంజిన్ స్థాయిలోనూ ఉండటం లేదు. ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ యువతలో అనేక ఆశలు రేకెత్తించి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ యేటికేడు ఉద్యోగాల కోతలు విధిస్తోందే తప్ప ఖాళీల భర్తీకి సంకల్పించడం లేదు. నిరుద్యోగుల కల్పతరువుగా ఉండే భారతీయ రైల్వేని సైతం ఖాళీలు భర్తీ చేయకుండా నిర్వీర్యం చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వ నిర్లిప్తత కారణంగా రైల్వేలో ఉద్యోగ ఖాళీలు ఈ మార్చి నెలాఖరు నాటికి 3.15 లక్షలకు చేరాయి. మోడీ సర్కార్ మాత్రం నియామకాలు చేపట్టడం లేదు. భారత రైల్వే మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం..ఈ ఒక్క ఏడాదిలోనే ఫిబ్రవరి 1 నాటికి ఖాళీ అయిన గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగాల సంఖ్య 21,837కు చేరింది. దీంతో రైల్వేల్లో మొత్తం ఖాళీల సంఖ్య 3,15,780కి పెరిగింది.

దేశంలోని 18 రైల్వే జోన్లలో 2,885 గెజిటెడ్ పోస్టులు, 3,12,895 నాన్ గెజిటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాన్ గెజిటెడ్ పోస్టుల్లో ఇంజనీరింగ్, టెక్నిసియన్స్, క్లర్కులు, స్టేషన్ మాస్టర్లు, టికెట్ కలెక్టర్లు తదితర పోస్టులు అత్యధికం ఖాళీగా ఉన్నాయి. మరో దుర్మార్గమైన అంశమేమిటంటే షెడ్యూల్ తరగతులు (ఎస్‌సి), షెడ్యూల్ తెగలు (ఎస్‌టి), ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి) కేటగిరీల్లో భర్తీ చేయాల్సిన ఉద్యోగాల భర్తీ పట్ల కూడా కేంద్రం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఈ విభాగాల్లో కనీసం 18, 670 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి.

ఈ ఏడాది జనవరి 1 నాటికి ఎస్‌సి కేటగిరిలో 6,112 పోస్టులు, ఎస్‌టి కేటగిరీలో 5,113 పోస్టులు, ఒబిసి కేటగిరిలో 7,427 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోన్లవారీగా పరిశీలించినప్పుడు అత్యధిక ఖాళీలు నార్తరన్ రైల్వేస్ (ఉత్తర రైల్వే) జోన్‌లో ఉన్నాయి. ఈ ఒక్క జోన్‌లోనే 38,754 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ తర్వాత వెస్టర్న్ రైల్వేస్ (పశ్చిమ రైల్వే)లో 36,476 పోస్టులు భర్తీకి నోచుకోకుండా మిగిలిపోయాయి. కాగా ఈస్టర్న్ రైల్వేస్ (తూర్పు రైల్వే)లో 30,141 పోస్టులు, సెంట్రల్ రైల్వేస్ (కేంద్ర రైల్వే)లో 28,650 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

భారత రైల్వేలో ఉద్యోగ ఖాళీలు యేటికేడు పెరిగిపోతున్నా..నియామకాలు మాత్రం పట్టాలెక్కడం లేదని రైల్వే సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. గడిచిన మూడేళ్ల కాలంలో 1,41,886 మంది రైల్వే ఉద్యోగులు వివిధ కేటగిరీల్లో ఉద్యోగ విరమణ పొందారు. సంవత్సరాల వారీగా చూస్తే 2019-20లో 50,051 మంది, 2020-21లో 46,988 మంది, అలాగే 2021-22లో 44,847 మంది ఉద్యోగ విరమణ పొందారు. అయితే నియామకాల ప్రక్రియ మాత్రం నత్తనడకన సాగుతోంది. ఒక్క 2019-20లో మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో 1,37,632 పోస్టులు రిక్రూట్ చేయగా ఆ తర్వాత నియామక ప్రక్రియ పడకేసింది. 2020-21లో 5,744 పోస్టులు, 2021-22లో 4,666 పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. భారతీయ రైల్వేతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని రక్షణ శాఖ, ఇతర కీలకమైన అన్ని శాఖల్లోనూ ఖాళీలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. రైల్వే, రక్షణ వంటి ప్రధాన శాఖల్లోనే దాదాపు 10 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే కేంద్రం ప్రభుత్వం ప్రకటించింది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి ఇప్పటికే ఆర్థిక వ్యవస్థ కునారిల్లుతున్న నేపథ్యంలో పోస్టులు కూడా భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తే ఉపాధి వనరులు సన్నగిల్లి సంక్షోభం మరింతగా వేళ్లూనుకునే ప్రమాదముందని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. పోస్టులు భర్తీ చేయాలని కార్మిక, ఉద్యోగ, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ముందుకు సాగని రెండో దశ పనులు

బడులు తెరిచే నాటికి 'నాడు-నేడు' పూర్తవుతుందా?



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మన బడి నాడు-నేడు రెండో దశ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2021లో చేపట్టిన పనులు ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. 22,344 పాఠశాలల్లో రెండో దశ నాడు-నేడు కింద మౌలిక వసతులు, అదనపు తరగతి గదులు కల్పించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం రూ.8వేల కోట్లతో అంచనా వేసింది. 2021లో రెండోదశ కింద రూ.4,400 కోట్లతో 15 వేల పాఠశాలల్లో మాత్రమే ఈ పనులు చేపట్టాలని నిర్ణయించుకొని, తరువాత వీటిని 22,344 పాఠశాలలకు విస్తరించింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇప్పటివరకు నిధులు విడుదల కాకపోవడం, నిర్మాణ రంగానికి కావాల్సిన మెటీరియల్ సరఫరా చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రెండోదశ పనులపై ఇటీవల పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎక్కడి పనులు అక్కడే నిలిచినట్లు గుర్తించారు. నాడు-నేడు సబ్ కంపౌండ్స్ పనులు అసలు ప్రారంభం కాలేదని విద్యాశాఖ గుర్తించింది. గ్రీన్ చాక్ బోర్డులు, అదనపు తరగతి గదులు, ప్రహరీ ఇతర పనులను ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభించాలని ఆదేశించింది. పాఠశాలలు ప్రారంభించే జూన్ 12వ తేదీలోపు మొత్తం నాడు-నేడు పనులను పూర్తిచేయాలని పేర్కొంది. చిన్న, పెద్ద మరమ్మతులను మే 15వ తేదీలోపు పూర్తిచేయాలని పేర్కొంది. నిర్మాణానికి కావాల్సిన సిమెంట్, ఐరన్, ఇతర మెటీరియల్ పంపకుండా పనులు ఎలా పూర్తిచేయాలని పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు, ప్రధానోపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు నిధులు మంజూరు కూడా సక్రమంగా లేదు. మొత్తం రూ.8వేల కోట్ల నిధులలో రూ.2,544 కోట్లు విడుదలవ్వగా, ఇప్పటి వరకు రూ.1768 కోట్లు ఖర్చు చేసింది. ఇంకా రూ.6,232 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను కిలోమీటర్ పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలలకు తరలించింది. ఈ ప్రక్రియ 5,240 పాఠశాలల్లో జరిగింది. వచ్చే విద్యాసంవత్సరం కూడా ఈ తరగతుల తరలింపు చేపడతామని ప్రభుత్వం చెబుతోంది. తరలించిన పాఠశాలల్లో అదనపు గదులు కచ్చితంగా నిర్మించాల్సి ఉంది. సుమారుగా 22వేల అదనపు తరగతులు అవసరమవుతాయని విద్యాశాఖ అంచనా వేసింది. నిధులు మంజూరు చేయకుండా, అవసరమైన మెటీరియల్ అందించకుండా అదనపు తరగతి గదులు ఎలా పూర్తవుతాయని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. అవసరమైన గదులు లేకుండా విద్యార్థులను తరలిస్తే ఇబ్బందిపడక తప్పదని చెబుతున్నారు.

ఆ భూముల వివరాలు వెల్లడించండి

రెగ్యులరైజ్ చేసిన నిషిద్ధ భూములపై సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అక్రమార్కుల భూములను క్రమబద్ధీకరించడానికే రాష్ట్రప్రభుత్వం రెండు లక్షల ఎకరాలను నిషిద్ధ జాబితా 22(ఎ) నుండి తప్పించిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ భూముల వివరాలను తక్షణమే బహిరంగపరచాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్యానంతరం భూముల సర్వే (ఆర్ఎస్ఆర్) చేసే సమయంలో బతుకుతెరువు కోసం వలస వెళ్లిన పేద రైతుల వివరాలు అందుబాటులో లేకపోవడంతో అటువంటి భూములను ప్రభుత్వ భూములతో సమానంగా నిషిద్ధ భూములని చుక్కలు పెట్టారని తెలిపారు. ఈ భూముల్లో అమ్మకాలు, రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకుండా నిషేధించారని తెలిపారు. ఈ భూముల్లో నిజమైన హక్కుదారులు 25 లక్షల మంది వరకూ ఉంటారని గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించింది. ఈ భూములకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని 22(ఎ) ఎత్తివేయాలని కొంతమంది రైతులు హైకోర్టుకు వెళితే అర్హుల భూములకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని, 22(ఎ)ను ఎత్తివేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. అయినా నేటికీ హైకోర్టు తీర్పును ప్రభుత్వం అమలు చేయలేదని, రాష్ట్రంలో భూముల విలువ పెరిగిన తరువాత అనేకమంది రాజకీయ పలుకుబడి కలిగినవారు, భూకబ్జాకారులు పేదలకు చెందిన భూములను ఆక్రమించుకున్నారని తెలిపారు. వీటిలో చుక్కల భూములు ఉండడంతో వాటిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని మంత్రులు, పలుకుబడి కలిగిన వారు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో రెండు లక్షల ఎకరాలను 22 (ఎ)నుండి తొలగించినట్లుందని వివరించారు. తరతరాలుగా పేదలు సాగుచేసుకుంటున్న భూములకు నిషేధం ఎత్తివేయలేదని, పైగా అక్రమార్కులకు మాత్రం నిషేధం ఎత్తివేయడం గర్హనీయమని తెలిపారు. మరోవైపు పేదల భూములను రెగ్యులరైజ్ చేయడానికి లక్షల రూపాయలు వసూలు చేయడం సరైంది కాదని, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. తరతరాలుగా సాగులో ఉన్నటువంటి సన్న, చిన్నకారు రైతుల భూములను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అనర్హులకు రెగ్యులరైజ్ చేసిన భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం హైకోర్టు తీర్పును అమలు చేసి సన్న, చిన్నకారు రైతుల చుక్కల భూములను నిషేధ జాబితా నుండి తొలగించాలని కోరారు.



బియ్యం ధరలు పైపైకి

- 26 కేజీ బస్తాకు రూ.150 నుంచి రూ.200 పెంపు
- ప్రజలు బెంబేలు - చక్రం తిప్పుతున్న బియ్యం వ్యాపారుల 'సిండికేట్'

● లోపలి పేజీలో.. ●

దేశంలో 3,167 పులులున్నాయ్ !

- గణాంకాలు విడుదల చేసిన ప్రధాని మోడీ

● లోపలి పేజీలో.. ●

ఈతకెళ్లి ముగ్గురు మృతి

ఈస్టర్ పండగ రోజు విషాదం

ప్రజాశక్తి- వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

ఈస్టర్ పండగ రోజు ఆనందంగా గడపాలని అనుకున్న వారి ఆశను పంట కాలువ బలితీసుకుంది. సరదా కోసం ఈతకు వెళ్లిన వారిలో ముగ్గురు మృతి చెందారు. మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. వైఎస్ఆర్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... వేంపల్లె మండలం అలవలపాడు ఎస్‌సి కాలనీకి చెందిన అక్కాతమ్ముళ్లు సాయి తేజశ్రీ (11), సుశాంత్ (10), వారి మేనమామ శశికుమార్, వేల్పుల గ్రామానికి చెందిన జానయ్య (25) కలిసి ఈస్టర్ పండగ సందర్భంగా గ్రామ సమీపంలోని జిఎన్ఎస్ఎస్ కాలువలోకి ఈత కొట్టేందుకు దిగారు. ఈ కాలువలో బురద మట్టి ఎక్కువగా ఉండడంతో అక్కాతమ్ముళ్లు అందులో కూరుకుపోయారు.



మరణించిన అక్కాతమ్ముళ్లు సాయి తేజశ్రీ, సుశాంత్

వారిని కాపాడేందుకు ప్రయత్నించిన జానయ్యకు కూడా బురదలో ఇరుక్కుపోయారు. బయటకు రాలేక వీరు ముగ్గురూ మృతి చెందారు. శశికుమార్ సురక్షితంగా ఒడ్డుకు చేరారు. ముగ్గురి మృతదేహాలనూ స్థానికులు వెలికితీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేద్దామంటే కొలువే లేదు!

- అరకొర వేతనాలు, అభద్రత
- వాస్తవాల వక్రీకరణలో ప్రభుత్వ అనుకూల ఆర్థికవేత్తలు

● లోపలి పేజీలో.. ●

పోలవరం నిర్వాసితులు నట్టేటేనా?

- వర్షాకాలం వస్తున్నా పరిహారం అందజేతపై తాత్సారం
- పూర్తికాని నిర్వాసిత కాలనీలు
- ముంపు గ్రామాల లెక్కలపై స్పష్టత లేదు



జీలుగుమిల్లి మండలంలో ఇంకా పూర్తికాని నిర్వాసిత కాలనీ

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయి. నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారంపై తాత్సారం చేస్తున్నాయి. 2022 జులైలో విరుచుకుపడిన వరద అనంతరం వేలేరుపాడులో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 41.15 కాంటూరు పరిధిలోని నిర్వాసితులకు వచ్చే అక్టోబర్‌లో పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నిధులివ్వడం లేదని, మరింత ఒత్తిడి తెస్తామని అన్నారు. మళ్లీ వర్షాకాలం వస్తోన్నా ఇప్పటికీ నిర్వాసితులకు పరిహారం అందలేదు. నిర్వాసిత కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో, నిర్వాసితులను మళ్లీ వరద భయం వెంటాడుతోంది. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మూడు కాంటూర్లుగా అధికారులు విభజించారు. ప్లస్ 35.00, ప్లస్ 41.15, ప్లస్ 45.72గా పేర్కొన్నారు. తొలివిడతగా పోలవరం మండలంలో ఎనిమిది గ్రామాలను ఖాళీ చేయించారు. ఈ గ్రామాల్లోని నిర్వాసితుల్లో చాలామందికి భూమికి భూమి, 18 ఏళ్ల నిండిన యువతకు పరిహారం సక్రమంగా అందించలేదు. ఇప్పుడు 41.15 కాంటూరుకు సంబంధించి కుక్కునూరు మండలంలో ఎనిమిది గ్రామాలను, వేలేరుపాడులో 15 గ్రామాలను ఖాళీ చేయించాల్సి ఉంది. మొత్తం ఈ 23 గ్రామాల్లో 7,071 కుటుంబాలను తరలించాల్సి ఉంటుంది. గడిచిన ఏడాది వరదలకు ప్రభుత్వం చెప్పిన కాంటూరు లెక్కలన్నీ బూటకమని తేలిపోయింది. కాఫర్ డ్యామ్ వద్ద 40 మీటర్లకు వరద నీరు చేరుకునే సరికే మొత్తం గ్రామాలన్నీ మునిగిపోయాయి. దీంతో, కుక్కునూరు, వేలేరుపాడు మండలంలోని గ్రామాల ప్రజలంతా నెలల తరబడి పునరావాస కాలనీల్లో తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ముంపునకు గురైన గ్రామాలను 41.15 కాంటూరులో కలపాలని గిరిజన సంఘాలు, సిపిఎం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ఈ రెండు మండలాల్లో 18 గ్రామాలను 41.15 కాంటూరులో కలుపుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా గ్రామసభలు పెట్టి అవార్డు ప్రకటన ఇప్పటికీ చేయలేదు.

పరిహారంపై మాటమార్చిన ప్రభుత్వం

నిర్వాసితులకు పునరావాస పరిహారం కింద రూ.10.50 లక్షలు ఇస్తామని వైసిపి ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ, అలా ఇవ్వలేదు. టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన మాదిరిగానే రూ.6.36 లక్షలు మాత్రమే ఇస్తామని చెబుతోంది. ఇంటి విలువ పరిహారం, 18 ఏళ్లు నిండిన యువతకు ఇవ్వాల్సిన పరిహారం ఏ ఒక్కటీ ఇప్పటి వరకూ అందలేదు. 2006లో సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షల చొప్పున అదనంగా ఇస్తామని ప్రకటించిన పరిహారంపైనా నోరు మెదపడం లేదు. నిర్వాసితుల కోసం జీలుగుమిల్లి మండలంతోపాటు జంగారెడ్డిగూడెం వంటి చోట్ల కడుతున్న నిర్వాసిత కాలనీలు ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో గతేడాది వరదలను తలచుకుని నిర్వాసితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పోలవరం నిర్వాసితులపై కేంద్రం వ్యవహరిస్తోన్న తీరే ఇన్ని ఇబ్బందులకు కారణమనే అభిప్రాయం అక్కడి ప్రజల్లో వ్యక్తమవుతోంది.

అవార్డు పాస్‌చేసి పరిహారం ఇవ్వండి



తొలుత మా గ్రామాన్ని 45.72 కాంటూరులో చేర్చారు. గత ఏడాది జులైలో వరదలకు మా గ్రామం మొత్తం మునిగిపోయి ఇళ్లపై నుంచి వరదనీరు ప్రవహించింది. దీంతో, ఆందోళనలు చేయగా మా గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చారు. అయితే, గ్రామసభలు నిర్వహించి అవార్డు మాత్రం చేయలేదు. మళ్లీ వర్షాకాలం వస్తుండడంతో భయమేస్తోంది. త్వరగా పరిహారం అందించాలి.

-గుంటుపల్లి రామాచారి, బెస్తవారి గూడెం, కుక్కునూరు మండలం

ఇప్పటికీ పునరావాస కాలనీలోనే



గత ఏడాది జులైలో వరదలకు ఇల్లు మొత్తం మునిగిపోయి కూలిపోయింది. వరదల సమయంలో కివ్వాక పునరావాస కాలనీకి వచ్చి తలదాచుకున్నాం. పరిహారం ఇచ్చి, ఇల్లు నిర్మిస్తే వెళ్లిపోదామని చూస్తున్నా. ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదు. **-షేక్ ఇమామ్‌బి, కుక్కునూరు 'ఎ' బ్లాక్**

నేటి నుంచి రోజుకి 5వేల కోవిడ్ టెస్టులు

- జిల్లా కేంద్రాల్లో నేడు, రేపు మాక్ డ్రిల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈనెల 10నుంచి రోజుకి ఐదు వేల కోవిడ్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 10, 11 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం క్రియాశీలక కేసుల్లో బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. విజయవాడ జిజిహెచ్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరిన వారిలో జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలు కనిపిస్తున్నాయని తెలిపింది. చిన్న పిల్లల్లో కళ్లలో ఎరుపుదనం కనిపిస్తోందని, పెద్దవాళ్లలో జ్వరం రెండు రోజుల్లో తగ్గిపోయాక దగ్గు వస్తోందన్నారు. గతంలో మాదిరిగా గొంతునొప్పి, ఒంటినొప్పులు పెద్దగా లేవని వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇతర రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్నందున రాష్ట్రంలో కూడా పరీక్షల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రస్తుతం రోజుకు వెయ్యి పరీక్షలు కూడా జరగడం లేదని తెలిపింది. రాష్ట్రంలో ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన ఎక్స్ బిబి1.16 (ఆర్క్చ్యురస్) కోవిడ్ కేసులు నమోదవుతున్నాయని, ప్రపంచ ఆరోగ్యసంస్థ జారీ చేసిన జాబితాలో ఈ వేరియంట్ గురించి ప్రస్తావించిందని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.


మాట్లాడుతున్న లింగారెడ్డి

విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

- ప్రొగ్రెసివ్ డాక్టర్స్ వేదిక నాయకులు డాక్టర్ లింగారెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని ప్రొగ్రెసివ్ డాక్టర్స్ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కాసుల లింగారెడ్డి తెలిపారు. 'ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం-సవాళ్లు-మార్గాలు' అన్న అంశంపై నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి సదస్సు ఆదివారం జరిగింది. ఈ సదస్సులో లింగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, సమతుల్యంతో కూడిన వ్యక్తి సమాజంలో ఆరోగ్యవంతుడిగా గుర్తింపబడతారని తెలిపారు. మనిషి ఆరోగ్యవంతంగా జీవించేందుకు గాలి, వెలుతురు, నీరు, పరిశుభ్రత కీలక భూమికను పోషిస్తాయన్నారు. ఇవన్నీ అందుబాటులో ఉంటే మనిషి అనారోగ్యానికి గురికాడన్నారు. ఏవైతే వ్యాధికారకాలుగా ఉంటున్నాయో వాటిని ప్రభుత్వం నివారించేందుకు చర్యలు తీసుకోకుండా రోగాల గురించి మాట్లాడుకోవడం అర్థరహితమని తెలిపారు. ప్రజలు అనారోగ్యపాలైన సమయంలో వారి ఆరోగ్యానికి కావాల్సిన సదుపాయాలు ప్రభుత్వం కల్పించాల్సి ఉందని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి.రమణయ్య మాట్లాడుతూ ప్రజారోగ్యం, ప్రభుత్వ ఆరోగ్య సంస్థ లేకపోతే సాధారణ ప్రజానీకం జీవించలేని పరిస్థితి వస్తుందన్నారు. ఈ విషయాన్ని కరోనా వైరస్ గుణపాఠం నేర్పిందన్నారు. తొలుత ప్రజారోగ్యవేదిక రాష్ట్ర సావనీరును నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించారు. సదస్సులో ప్రజారోగ్య వేదిక మాజీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సురేష్ తెలుగులోకి అనువదించిన 'వైద్యానికి సుస్తి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రాజేశ్వరరావు, జి.శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ వచ్చినా యాక్షన్ ప్లాన్ ఏదీ?

- వేసవిలో మంచినీటిపై కదలిక లేని ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేసవి వచ్చినా నీటి ఎద్దడి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాక్షన్‌ప్లానుపై ఇంతవరకు దృష్టి సారించినట్లు లేదు. పట్టణ ప్రాంతాలకు సరఫరా అయ్యే అన్ని వనరులూ అడుగంటుతుండటంతో ఈసారి నీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ వేసవిలో వేడిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండొచ్చని ప్రకృతి విపత్తుల విభాగం ప్రకటించింది.



రెండు డిగ్రీల నుండి నాలుగు డిగ్రీల వరకూ పెరగొచ్చని హెచ్చరించింది. వేసవిలో ఎద్దడిని నివారించేందుకు మార్చి నాటికే యాక్షన్ ప్లాను ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ దిశగా తగిన చర్యలు తీసుకోలేదు. సమస్య ఉత్పన్నమైన తరువాత హడావుడిగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడం లేదు. దీంతో సమస్య జటిలం అవుతోంది. ఇప్పటికే పలు మున్సిపాలిటీల్లో రోజు మార్చి రోజు నీటి సరఫరా జరుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లోనూ, వేసవిలోనూ నీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్లు ఏర్పాటు చేసుకోవడం, పాడైన బోర్లను బాగుచేయడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఇప్పటి వరకూ చేయలేదు. రాయలసీమ జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో గత ఏడాది మూడు, నాలుగు రోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేశారు. గత ఏడాది అనుభవంతో ఈ ఏడాది సమస్యను పరిష్కరించాల్సి ఉన్నా ఇప్పటి వరకూ చర్యలు లేవు. ఆయా ప్రాంతాల్లో సమస్య మరీ తీవ్రంగా ఉంటోంది. తుంగభద్ర, కెసి కెనాల్, కృష్ణ, హంద్రీ చెంతనే ఉన్నా కర్నూలులో రెండు రోజులకు ఒకసారి, అదీ గంట సేపు మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారు. ఒక కుటుంబం ఉన్నచోటే నీటి సమస్య ఉంటే నాలుగైదు ఇళ్లు కలిసి ఉన్నచోట ఇప్పటికీ తగాదాలు అవుతూనే ఉన్నాయి. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో తీరని నీటి సమస్య నెలకొంది. కొడుమూరు, రాయచోటి, పత్తికొండ నియోజకవర్గాల్లోనూ సమస్య జటిలంగా మారింది. పలుచోట్ల వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి రైతులను అడిగి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. తాగేందుకు ఉపయోగపడకపోయినా అనివార్యంగా వాటినే తాగుతున్నారు. వాడుక నీళ్ల సమస్య చెప్పనవసరం లేదు. ఉమ్మడి అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోనూ సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికే రెండు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్న నేపథ్యంలో అనివార్యంగా అనుకోని ఇబ్బంది ఎదురైతే నాలుగు రోజుల వరకూ తాగేందుకు నీరులేని దుస్థితిలో రాష్ట్రంలో పలుప్రాంతాల్లో నెలకొంది.


శ్రీధర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైసిపి శ్రేణులు

అమరావతిలో ఇసుక సవాళ్లు

- టిడిపి కార్యకర్తలపై లాఠీఛార్జి, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ అరెస్టు
- అభివృద్ధిపై చర్చకు సిద్ధం : ఎమ్మెల్యే శంకరరావు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి/అమరావతి

టిడిపి, వైసిపి నాయకుల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో పల్నాడు జిల్లా అమరావతిలో ఆదివారం ఉద్రిక్తత నెలకొంది. ఇసుక అక్రమ రవాణాపై పరస్పర ఆరోపణలతో అమరావతి అమరలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేయాలని వైసిపి ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు, టిడిపి మాజీ ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. టిడిపి హయాంలోనే ఇసుక అక్రమ వ్యాపారం జరిగిందని ఎమ్మెల్యే శంకరావు ఆరోపించగా, గత నాలుగేళ్లలో జరిగిన అక్రమాలపై అన్ని ఆధారాలతో చర్చకు వస్తానని శ్రీధర్ సవాల్ విసిరారు. దీంతో ఇరు పక్షాలు అమరావతిలో మొహరించాయి. దీంతో పోలీసులు అమరావతిలో 144 సెక్షన్ విధించారు. వ్యూహాత్మకంగా ఎమ్మెల్యే శంకరరావు శనివారం రాత్రి అమరావతిలో బస చేసి తన అనుచరులతో ఆదివారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఇసుక తవ్వకాలపై తాను ఎన్‌జిటిలో పిటీషన్ వేయించానని ఆరోపించిన శ్రీధర్ ఆలయంలోకి వచ్చి ప్రమాణం చేయాలని ఎమ్మెల్యే శంకరరావు డిమాండ్ చేశారు. టిడిపి ప్రభుత్వ హయంలో శ్రీధర్ చేసిన అవినీతిపైనా, వైసిపి హయాంలో జరిగిన అభివద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. నాలుగేళ్ల పాలనలో తాను అవినీతికి పాల్పడలేదని తెలిపారు. శ్రీధర్ అవినీతి చిట్టా తెచ్చానని, చర్చకు రావాలని కోరారు. ఆలయం వద్ద శ్రీధర్ దిష్టిబొమ్మను వైసిపి కార్యకర్తలు దహనం చేశారు. అయితే, వైసిపి కార్యకర్తలను, ఎమ్మెల్యేను పోలీసులు నియంత్రించకపోవడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌ను, టిడిపి నాయకులు, కార్యకర్తలను ఊరిబయటే పోలీసులు అడ్డుకున్నారు. టిడిపి కార్యకర్తలు తోసుకుని ముందుకు రావడానికి ప్రయత్నించగా వారిపై లాఠీఛార్జి చేశారు. శ్రీధర్‌ను బలవంతంగా వాహనంలో తరలిస్తుండగా టిడిపి కార్యకర్తలు అడ్డుకొని అద్దాలను పగలుగొట్టారు. దీంతో శ్రీధర్‌ను, ఆయన అనుచరులను అరెస్టు చేసి క్రోసూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ ఎదుట టిడిపి కార్యకర్తలు ధర్నా చేయడంతో ఆయనను పలు పోలీసు స్టేషన్లకు తిప్పుతూ సాయంత్రం గుంటూరులోని ఆయన కార్యాలయంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ టిడిపి హయాంలో ఇసుక విక్రయాలలో తాను అక్రమాలకు పాల్పడ్డానని ఎమ్మెల్యే శంకర్రావు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ రంగంలో పెట్టుబడులపై దృష్టి

- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగంలో పెట్టుబడులపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఈ రంగంలో 9.57 లక్షల కోట్లతో 1.8లక్షల మందికి ఉపాధి అవకాశాలను సృష్టించే అవకాశం ఉందన్నారు. దీనికోసం ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించాలని చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మార్చిలో జరిగిన జిఐఎస్ సదస్సుల్లో విద్యుత్ రంగంలో రూ.81వేల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం 42 అవగాహన ఒప్పందాలు జరిగాయని తెలిపారు. వీటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం హైబ్రిడ్ పంప్డ్ హైడ్రో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు, సోలార్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో 25 గిగా వాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టుల స్థాపనకు ఎంవోయులు జరిగాయని తెలిపారు. అనంతపురం, కర్నూలు, కడప, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఈ ప్రాజెక్టులు రానున్నాయని చెప్పారు. రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్‌కు వనరులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 29 చోట్ల 33,200 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులు రానున్నాయని చెప్పారు. ఖరీదైన పాత థర్మల్ బొగ్గు యూనిట్ల స్థానంలో పునరుత్పాదక విద్యుత్ లభిస్తే రాబోయే రోజుల్లో రూ.76 వేల కోట్లు రాష్ట్రం ఆదా చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనివల్ల వినియోగదారులకు విద్యుత్‌ను చౌకగా అందించే అవకాశం ఉందని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు, వాయు కాలుష్యం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు, డిస్కంల సిఎండిలు ఐ పృధ్వీతేజ్, కె సంతోషరావు, పద్మజనార్ధన రెడ్డి, నెడ్‌క్యాప్ ఎమ్‌డి ఎస్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడీ మద్దతుతో దేశంపై అదానీ దాడి

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి-రామచంద్రపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

భారతదేశంలో ప్రతి అంగుళాన్ని తన సొంతం చేసుకునేందుకు మోడీ మద్దతుతో అశ్వమేధ యాగం చేసినట్లుగా అదానీ దేశంపై దాడి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ విమర్శించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ హాల్లో 'ప్రస్తుత ఆర్థిక సంక్షోభం -పర్యవసానాలు' అనే అంశంపై ఆదివారం జెవివి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చెలికాని స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుల్లో శర్మ ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. దేశ చరిత్రలో విదేశీ దురాక్రమణదారులను చూశామన్నారు. ఇప్పుడు ఏకంగా స్వదేశీ దురాక్రమణదారులను చూస్తున్నామని తెలిపారు. మోదీ మద్దతుతో అదానీ చేస్తున్న కార్యకలాపాలే దీనికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కృష్ణపట్నం, గంగవరం పోర్టులను సొంతం చేసుకోవడమే కాకుండా విశాఖలో డేటా సెంటర్ పేరుతో 400 ఎకరాలను కారుచౌకగా గుంజుకునేందుకు అదానీ ప్రయత్నం చేస్తున్నారన్నారు. సోలార్ విద్యుత్తు పేరుతో వేలాది ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం అదానికి కట్టబెట్టిందని వివరించారు. ఏజెన్సీలో ఆయుధ కర్మాగారం, పంప్డ్ స్టోరేజ్, హైడల్ విద్యుత్ ప్రాజెక్టుల వల్ల గిరిజనుల ఉనికే ప్రమాదంలో పడిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టిన వైసిపి ప్రభుత్వం అదానికి అడిగిన చోటల్లా భూములు రాసి ఇచ్చిందన్నారు. ప్రభుత్వ ఆస్తులే కాకుండా ప్రజల ఆస్తులనూ అదాని కొల్లగొడుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలను ఆశ చూపి సంపదను కోల్పోతున్న ప్రజల నోళ్లను రాష్ట్ర ప్రభుత్వం నొక్కేస్తోందని విమర్శించారు. సహజ వనరులను లూటీ చేయడానికి అదానీ కంపెనీలు దేశంపై డేగల్లా వాలాయన్నారు. మోసం దగాలతో ఎనిమిదేళ్లలో అదానీ కంపెనీ ఉన్నత శిఖరాలకు చేరిందని దుయ్యబట్టారు. హిండెన్ బర్గ్ నివేదికతో దాని అసలు రంగు బయట పడిందని తెలిపారు. దీనిపై దేశ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. రాష్ట్రాన్ని అదానీ పీడ నుంచి వదిలించుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు ముందుకొచ్చి పోరాడాలని సూచించారు. ఈ సదస్సులోల జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పి నరసింహారావు, సిఐటియు నాయకులు నూకల బలరాం, సిద్దు, పెద్దిరెడ్డి రాము, కెవిపిఎస్ నాయకులు సత్యనారాయణ, డాక్టర్ చైతన్య, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దళితులు, గిరిజనులపై దాడులను అరికట్టాలని రేపు మండుటెండలో వి శ్రీనివాసరావు 'పూలే దీక్ష'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఉన్నతస్థాయి న్యాయవిచారణ జరిపించాలని కోరుతూ జ్యోతిబాపూలే 196వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 11వ తేదీన గుంటూరులో సిపిఎం ఆధ్వర్యాన మండుటెండలో 'పూలే దీక్ష' జరగనుంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారు. మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులు, ప్రజలు ఈ దీక్షకు మద్దతు తెలిపి జయప్రదం చేయాలని సిపిఎం కోరింది. రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దాడులు, హత్యలు పెచ్చరిల్లుతున్నాయి. కడపలో పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చన్న, కాకినాడ జిల్లా శృంగవృక్షంలో దళిత యువకుడి హత్య, నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో దళితునిపై దాడి, ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య, వాకపల్లి గిరిజన మహిళలకు జరిగిన అన్యాయం ఘటనలకు తార్కాణాలని తెలిపారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం నిందితులకే కొమ్ము కాస్తున్నాయని, దళిత, గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని పేర్కొంది. ఈ ఘటనలపై ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరిపించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ దాడులను అరికట్టాలని, ఎస్‌సి, ఎస్‌టిలకు రక్షణగా ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ సామాజిక విప్లవకారుడు జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా జరుగుతున్న దీక్షలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని, ఈ దీక్షను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.



కీరవాణి, చంద్రబోస్‌లకు ఘన సన్మానం

హైదరాబాద్: ఆస్కార్ గ్రహీతలు ఎం.ఎం కీరవాణి, చంద్రబోస్‌ను తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఘనంగా సన్మానించింది. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాటకుగాను కీరవాణికి, రచయిత చంద్రబోస్‌కు ఆస్కార్ లభించిన విషయం తెలిసిందే. వీరిద్దరిని తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఘనంగా సన్మానించింది. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో సినిమా 24 విభాగాలకు చెందిన పలువురు ప్రముఖులతోపాటు తెలంగాణ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ.. "రాజమౌళి, ప్రేమ్‌రక్షిత్, 'నాటు నాటు'కు కష్టపడి డ్యాన్స్ చేసిన రామ్‌చరణ్, ఎన్టీఆర్, అందులో కనిపించిన ఉక్రెయిన్ డ్యాన్సర్లు.. ఇలా సమష్టి కృషితోనే ఆస్కార్ సాధించాం" అని అన్నారు. 'తెలంగాణ యాసతో సాగే 'నాటు నాటు' పాటకు ఆస్కార్ వచ్చినందుకు మేం గర్విస్తున్నాం. రెండు రాష్ట్రాల ప్రజలు సోదరుల్లా ఉండాలనేదే మా ప్రభుత్వ ధ్యేయం. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉంటుంది" అని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ రావాలని కొన్ని కోట్లమంది ఆకాంక్షించారు. అనుకున్నట్టుగానే ఆ అవార్డు వచ్చింది. ఈ కార్యక్రమం నిర్వహించిన 24 విభాగాల వారికి అభినందనలు" అని తలసాని పేర్కొన్నారు.

పవర్ ప్రాజెక్టుల పేరుతో ఏజెన్సీలోకి కార్పొరేట్లు

- బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు
- అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం తీర్మానం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

పవర్ ప్రాజెక్టుల పేరుతో ఏజెన్సీలోకి కార్పొరేట్ల చొరబాటును వ్యతిరేకించాలని, బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం తీర్మానించింది. ఆంధ్ర యూనివర్సిటీలోని వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా సంఘం జాతీయ అధ్యక్షులు పివి.రమణ, ప్రధాన కార్యదర్శి ఎం.హరిరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పివి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు గిరిజన ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. గిరిజన జాతి లక్షణాలు లేని బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడం దారుణమన్నారు. దీనికి రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎం.హరిరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఆదివాసీల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తోందన్నారు. నూతన విద్యా విధానం వల్ల ఆదివాసీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పాఠశాలలు, హాస్టళ్ల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. నాడు-నేడు పేరుతో కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్నామని చెబుతున్నా సమస్యలు పరిష్కారానికి నోచడంలేదని తెలిపారు.

తీర్మానాలు ఇవే..

బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ సమావేశం తీర్మానించింది. ప్రభుత్వ తీర్మానానికి మద్దతు ఇచ్చిన ఏడుగురు గిరిజన ఎమ్మెల్యేలూ వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి గిరిజనులతో కలిసి ఉద్యమించాలని డిమాండ్ చేసింది. హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో గిరిజన ప్రాంతాల్లో ప్రయివేట్ వ్యక్తుల చొరబాటును వ్యతిరేకించాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా ప్రకటించాలని, నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని తీర్మానాలను ఆమోదించింది. జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరింది.

ఈ సమావేశంలో 60 మంది సభ్యులతో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా వై.వెంకటేశ్వర్లు (కృష్ణా), అధ్యక్షులుగా కోరాబు సత్యనారాయణ (విశాఖపట్నం), ప్రధాన కార్యదర్శిగా దినారి ప్రభాకర్ (నెల్లూరు), వైస్ చైర్మన్‌గా కె.బ్రహ్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.బాలు నాయక్, కోశాధికారిగా జి.వెంకటేశ్వర్లు ఎన్నుకోబడ్డారు. పలువురు ఉపాధ్యక్షులుగా, కార్యదర్శులుగా, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు.

మోడీని గద్దె దింపితేనే దేశానికి రక్ష

మొదటిపేజి తరువాయి

సిబిఐ, ఇడిలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు మత ఉద్రిక్తతలను బిజెపి రెచ్చగొడుతోందన్నారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి నాడు ఘర్షణ జరిగిన సందర్భాలు దేశ చరిత్రలో ఎప్పుడూ లేవని, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతే మొదలయ్యాయని ఉదహరించారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో టిప్పు సుల్తాన్ చరిత్రను బిజెపి వక్రీకరిస్తోందన్నారు. బిజెపి దుర్మార్గాలను ప్రజలకు వివరించి చెప్పాల్సిన ఆవశ్యకత కమ్యూనిస్టులపై ఉందని తెలిపారు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా ప్రభుత్వం బిజెపిదే అని ఆ పార్టీ నాయకులు బాహాటంగా చెబుతున్నారంటే, బిజెపి అక్రమాలను అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదానీ కుంభకోణంపై సమాధానం ఇవ్వకుండా పార్లమెంట్‌ను అడ్డుకుందని, అదానీ వ్యవహారంపై సభ్యులు అడిగిన ప్రశ్నలు కనిపించకుండా రికార్డులనే మార్చివేశారని విమర్శించారు. కమ్యూనిస్టులు ఐక్యంగా బిజెపి ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టి కమ్యూనిస్టు ఉద్యమానికి పూర్వవైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ గతేడాది విజయవాడలో జరిగిన మహాసభలోనే కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణ జరగాలని సిపిఐ ప్రతిపాదించిందని గుర్తు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి కుట్రలను ఎలా ఎదుర్కోవాలనేదే కమ్యూనిస్టుల ముందున్న పెద్ద సవాల్ అని తెలిపారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని తీసుకురావాలని ఆర్‌ఎస్‌ఎస్ కుట్రపన్నిందని, దాన్ని బిజెపి అమలు చేస్తోందని విమర్శించారు. బిజెపియేతర ప్రభుత్వాలను విచ్ఛిన్నం చేసేందుకు కేంద్రం గవర్నర్లతో రాజకీయం నడుపుతోందని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే లక్ష్యంగా కమ్యూనిస్టులు పనిచేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ ఉత్తరాదిలో బిజెపి బలం కోల్పోతోందని, అందుకే దక్షిణాదిన ఎలాగైనా బలపడేందుకు ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. భవిష్యత్తులో గంపగుత్తగా అమ్మేసేందుకే రైల్వే స్టేషన్లను అందంగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టులకు స్థానం ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల త్యాగాలను కూడా బిజెపి వక్రీకరిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపికి స్థానం లేకుండా కమ్యూనిస్టులు ఐక్యంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే డిసెంబర్‌కు పూర్తయ్యేనా?

- 30,935 చదరపు కిలోమీటర్లలో పూర్తి
- డిప్యుటేషన్లు రద్దు చేయాలని కోరుతున్న సర్వేయర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వే ఈ ఏడాది డిసెంబర్ చివరికి పూర్తి చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందా? లేదా అనే మీమాంశ రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 17,460 గ్రామాల్లో 1.22 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకున్నప్పటికీ, ఆచరణలో ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అనే చందంగా సాగుతోంది. రీ సర్వే కోసం ప్రభుత్వం డ్రోన్, కార్స్ (కంటిన్యూయస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ సిస్టమ్)ను వినియోగిస్తోంది. 21.12.2020న భూముల రీసర్వే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు 20 ట్రినిటి డ్రోన్లను కొనుగోలు చేయగా, సర్వే ఆఫ్ ఇండియా 8 డ్రోన్లను అందించింది. 5,163 గ్రామాలకు సంబంధించి 30,935 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సర్వే పూర్తయినట్లు రెవెన్యూ గణాంకాలు తెలుపుతున్నాయి. మొదటి విడతలో 5,500 గ్రామాలు, రెండవ విడతలో 6,500 గ్రామాలు, మూడవ విడతలో 5,500 గ్రామాల భూములు రీసర్వే పూర్తిచేసేలా ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. ఇందులో భాగంగా 2023-24కు ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను ప్రభుత్వం తయారు చేసింది. భూముల రీసర్వే ప్రక్రియ పూర్తయితే భూయజమానులకు సంబంధించిన యూనిక్యూ నెంబరుతో కూడిన భూ యాజమాన్య హక్కు పత్రాలను అందజేస్తారు. కొత్తగా నమోదు చేసిన విస్తీర్ణంతో ల్యాండ్ పార్శిల్ మ్యాపింగ్ (ఎల్‌పిఎమ్) ఎఫ్‌ఎమ్‌బి, యూనిక్యూతో భూమికి సంబంధించిన సరిహద్దులను నిర్ణయిస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించే భూముల రీసర్వే కావడంతో కచ్చితత్వంతో కూడిన విస్తీర్ణం నమోదవుతుందని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

రీసర్వే కోసం శిక్షణ

భూముల రీసర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతికను వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం విఆర్‌ఒ, గ్రామ సర్వేయర్లు తహశీల్దార్లు, రెవెన్యూ సబార్డినేట్లకు కాకినాడ జిల్లా సామర్లకోటలోని ఏపి సర్వే ట్రైనింగ్ అకాడమీలో ఇప్పటివరకు 39 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. శిక్షణ పొందిన వారిలో 7,500 మంది గ్రామ సర్వేయర్లు, 4,950 మంది రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సిబ్బందితో పాటు ప్రొబేషనరీ పీరియడ్‌లోని రెవెన్యూ సబార్డినేట్లు, విఆర్‌ఒ గ్రేడ్-2లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. సర్వేకు సంబంధించిన పరీక్షలు 2022-23లో 5,096 మందికి ప్రభుత్వం నిర్వహించింది.

గ్రామ సర్వేయర్ల డిప్యుటేషన్లను రద్దు చేయాలి

ఒకవైపు భూముల రీసర్వే కార్యక్రమంలో పాల్గొంటూనే రోజువారీ విధులు నిర్వహించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని గ్రామ సర్వేయర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రీ సర్వే పేరుతో కొందరిని సుదూర ప్రాంతాలకు డిప్యూటేషన్లు వేశారని, తాము పనిచేస్తున్న గ్రామాల్లో కూడా రీ సర్వే జరుగుతున్న నేపథ్యంలో డిప్యుటేషన్లు రద్దు చేయాలని గ్రామ సర్వేయర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. రీ సర్వే చేసే సిబ్బందికి కావాల్సిన స్టేషనరీ ఖర్చులు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2023-24 ప్లాన్ ఆఫ్ యాక్షన్

యాక్టివిటి	ఇప్పటివరకు పూర్తయిన గ్రామాలు	మిగిలినగ్రామాలు	గడువుసమయం
ఏరియల్‌సర్వే	9,665	3,681	31.05.2023
డిజిపిఎస్ సర్వే	457	2,219	31.12.2023
ఒఆర్ఐఎస్	5,669	3,966	30.08.2023
గ్రౌండ్ సర్వే	3,445	2,154	30.10.2023
13వ నోటిఫికేషన్	2,445	3,245	31.12.2023

విద్యుదాఘాతంతో తాపీ కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

తాపీ పనిచేస్తూ విద్యుదాఘాతానికి గురై కార్మికుడు దుర్మరణంపాలైన ఘటన మండల కేంద్రం ఉంగుటూరు జగనన్న కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ప్రకారం... గ్రామానికి చెందిన షేక్ మహ్మద్(20) తాపీ పనులకు వెళ్లి కుటుంబానికి అండగా ఉంటున్నారు. పనిలో భాగంగా ఉంగుటూరు జగనన్న కాలనీలో ముఖద్వారం ఆర్చి నిర్మాణ పనులకు వెళ్లారు. ఆర్చి పైభాగంలో పిట్టగోడ, ప్లాస్టరింగ్ పనులు చేస్తుండగా ఆ కాలనీ మీదుగా వెళ్లిన 11 కెవి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలని కాంట్రాక్టర్‌ని డిమాండ్ చేశారు. కొద్దిసేపు ఆందోళన చేపట్టారు.

ఎట్టకేలకు నష్టపరిహారం ఇచ్చేందుకు కాంట్రాక్టర్ అంగీకరించడంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదూ అందలేదని పోలీసులు తెలిపారు. విద్యుత్ తీగలను ఆర్చికి దూరంగా జరిపేందుకు ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపామని, అనుమతుల కోసం ఎదురు చూస్తున్నామని, ఇంతలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ తీగలు మార్చేవరకూ పనులు చేపట్టొద్దని నిర్మాణదారులను కోరామని తెలిపారు.

ఎఆర్ ఎస్ఐకి దేహశుద్ధి

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా దర్గామిట్ట పరిధిలోని పోస్టల్ కాలనీ ప్రాంతంలో నివాసముంటున్న ఎఆర్ ఎస్ఐ వాసు కుటుంబ వ్యవహారం చర్చనీయాంశమైంది. మొదటి భార్య ఉండగా మరో మహిళ మౌనికను రెండో వివాహం చేసుకొని ఆమెతో జీవిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గుంటూరు ప్రాంతానికి చెందిన మొదటి భార్య సామ్రాజ్యం ఆమె బంధువులు పోస్టల్ కాలనీకి ఆదివారం వచ్చి ఎస్ఐకి దేహశుద్ధి చేశారు. తన భర్త తనను మోసం చేశారని, తనకు 30 ఏళ్ల కిందట వివాహమైందని, ఇద్దరు పిల్లలున్నారని, తాను జీవించి ఉండగానే మరో మహిళను వివాహం చేసుకొన్నారని బాధితురాలు సామ్రాజ్యం వాపోయారు. ఇప్పుడు విడాకులు కావాలని కోర్టును ఆశ్రయించాడని ఆవేదన వ్యక్తం చేశారు. విడాకులు తీసుకోకుండానే మరో మహిళను వివాహం చేసుకుని రహస్య జీవితం గడుపుతున్నాడని ఆరోపించారు. పోలీస్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

టిడ్కో, జగనన్న కాలనీలకు ఫైబర్ 'నెట్'

- సర్కారు ఆదేశాలు సరికాదంటున్న ఎంఎస్ఒలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వపరంగా నిర్మించే ఇళ్ల, కాలనీలు, టిడ్కో గృహ సముదాయాల్లో తప్పనిసరిగా ఫైబర్ నెట్ వాడాలన్న ఆదేశాల పట్ల ప్రజలు, ఎంఎస్ఒల నుంచి వ్యతిరేకత వస్తోంది. విజయవాడసహా పలు ప్రాంతాల్లో ఫైబర్‌నెట్ సిగ్నల్ తరచూ ఆగిపోతోందని వినియోగదారులు చెబుతున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఇటీవల పూర్తయిన టిడ్కో ఇళ్లలో కొద్దిమంది సాధారణ కనెక్షన్లు తీసుకున్నారు. దీనిపై ఫైబర్‌నెట్ ఆపరేటర్లు విజయవాడ ఫైబర్‌నెట్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయా జిల్లాల అధికారులకు సమాచారం ఇస్తామని, ఇతర కనెక్షన్లు తొలగించాలని ఆదేశిస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని, ఫైబర్‌నెట్ ఫీజు తగ్గించాలని, అంతరాయం లేకుండా ఛానెళ్ల ప్రసారమయ్యేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

జర్నలిస్టుల స్థలాల్లో అక్రమ మైనింగ్‌ను ఆపాలి

- సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలు నగర శివార్లలోని జగన్నాధగట్టుపై జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్లస్థలాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను తక్షణం నిలిపివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. 2009లో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ది కర్నూలు డిస్ట్రిక్ట్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి మార్కెట్ విలువతో 15.44 ఎకరాలను కేటాయించిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రూ.65 లక్షలు చెల్లించి దాదాపు 260మంది జర్నలిస్టులు సొసైటీ నుండి ప్లాట్‌లను రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో వారు ఇళ్లను నిర్మించుకోవడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. మైనింగ్ మాఫియా ఆ స్థలాల్లో పెద్దఎత్తున అక్రమంగా తవ్వకాలను చేపట్టిందని, 20 అడుగుల మేర గుంతలు ఏర్పడి ప్లాట్‌ల సరిహద్దు రాళ్లన్నీ చెల్లాచెదురయ్యాయని తెలిపారు. తక్షణం ప్రభుత్వం జోక్యం చేసుకొని అక్రమమైనింగ్ జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బియ్యం ధరలు పైపైకి

- 26 కేజీ బస్తాకు రూ.150 నుంచి రూ.200 పెంపు
- ప్రజలు బెంబేలు -చక్రం తిప్పుతున్న బియ్యం వ్యాపారుల 'సిండికేట్'

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

బియ్యం ధరలు రోజురోజుకూ ఎగబాకుతున్నాయి. పదేళ్లలో ఎన్నడూ లేనంతగా గరిష్ట ధరలు పలుకుతుండటంతో పేదలకు కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా సన్నాలు పెరుగుతున్నాయి. చిల్లర దుకాణాల్లో వీటి ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. హోల్‌సేల్ మార్కెట్లో 26 కిలోల బస్తా రూ.1,560కు చేరింది. గతంలో రూ.1,250 లభించేది. కరోనా ముందు నుంచి పాత బియ్యం ధర చాలాకాలంగా కిలో రూ.48గా ఉంది. గతేడాది డిసెంబరు నుంచి ధర పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం 'ఎ' గ్రేడ్ సన్నాలు రకం కిలో రూ.60 ఉంది. ఆ తర్వాతి రకాలు కిలో రూ.54గా ఉన్నాయి.



పాత బియ్యానికి డిమాండ్

పాత బియ్యానికి డిమాండ్ పెరిగింది. దీంతో, కొందరు మిల్లర్లు ఆవిరితో మరపట్టించిన బియ్యాన్ని పాతబియ్యంతో కలిపి విక్రయిస్తున్నారు. ఒకే రకమైన బియ్యాన్ని వివిధ బ్రాండ్ల పేరుతో ఆకర్షణీయమైన సంచుల్లో నింపి ధరలు పెంచి విక్రయిస్తున్నారు. బియ్యం విక్రయిస్తున్న కంపెనీలు పన్నుల నుంచి ఉపశమనం పొందడానికి 26 కిలోలు, 30 కిలోల బస్తాలను అందుబాటులోకి తెచ్చాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 25 కిలోలు దాటితే పన్ను ఉండదు. ఈ దృష్ట్యా వ్యాపారులు 26 కిలోల బస్తాలను విక్రయిస్తున్నారు.

రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు

ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తోంది. నిబంధనల కొర్రీతో రైతులు ఆర్‌బికెల్లో వీటిని విక్రయించలేకపోతున్నారు. ఫలితంగా వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరకంటే రూ.200 నుంచి రూ.300 తక్కువకే ధాన్యాన్ని రైతుల నుంచి వారు కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన ధాన్యం మిల్లింగ్ చేస్తే 80 కేజీల బస్తాకు సుమారు 57 కేజీల నుంచి 60 కేజీల వరకు బియ్యం వస్తాయి. మిల్లింగ్ కోసం మిల్లర్లకు సుమారు రూ.150 ఖర్చవుతోంది. మిల్లు మెయింటెనెన్స్‌కు ఊక, తవుడు, నూకలు సరిపోతాయి. మొత్తంగా 80 కేజీల ధాన్యాన్ని బియ్యంగా మార్చడానికి మిల్లర్‌కు సుమారు రూ.2 వేల నుంచి రూ.2,500 వరకూ ఖర్చవుతోంది. దిగుబడి 57 కేజీలు వస్తోంది. కిలో రూ.60 చొప్పున రూ.3,420కు విక్రయిస్తుండడంతో మిల్లర్‌కు రూ.900పైగా లాభం చేకూరుతోంది.

రేషన్ బియ్యాన్ని ఇలా...

మరికొందరు మిల్లర్లు మరో అడుగు ముందుకేసి రేషన్ బియ్యాన్ని ప్రజల నుంచి కేజీ రూ.13 నుంచి రూ.15 కొనుగోలు చేస్తున్నారు. మిల్లింగ్ చేసే సమయంలో సన్న బియ్యంలో 20 శాతం వరకు వీటిని కలిపేస్తున్నారు. వీటినే బ్రాండెడ్ పేరిట ప్యాకింగ్ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు.

అక్రమల నిల్వలే కారణమా?

గతేడాది వర్షం వల్ల ధాన్యం దెబ్బతిందని, నిల్వలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో పండిన సన్నరకాల ధాన్యంలో 55 శాతం వరకు వరకూ మాత్రమే ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యాయి. మిగిలిన ధాన్యం వ్యాపారుల వద్దే ఉంది. దీంతో, బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ఉమ్మడి జిల్లాల్లో వ్యాపారులు పెద్దఎత్తున నిల్వ చేసిన ధాన్యాన్ని మార్కెట్లోకి తీసుకురాగలిగితే ధరలు అదుపు చేయవచ్చు. జిల్లా యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బియ్యం నిల్వలపై కంట్రోల్ అథారిటీ లేదు

బియ్యం నిల్వలపై కంట్రోల్ అథారిటీ లేదు. నిత్యావసరాలు ఫ్రీ ట్రేడ్ చేయాలనే ఉద్దేశంతో ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సడలించింది. గతంలో రిటైల్ షాపుల్లో 20 క్వింటాళ్లు మాత్రమే నిల్వ చేయాలనే పరిమితి ఉండేది. ఓపెన్ మార్కెట్లో డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవటంతో ధరలు పెరగడం సాధారణమే. ఆ నేపథ్యంలోనే ధరలు పెరిగాయి.

– ప్రసాదరావు, పౌరసరఫరాల శాఖాధికారి, తూర్పుగోదావరి జిల్లా

వలంటీర్ వ్యవస్థ దుర్వినియోగం

- సిఎస్‌కు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వలంటీర్ వ్యవస్థను వైసిపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ప్రభుత్వ ధనం జీతాలుగా ఇచ్చి పార్టీ సేవ చేయించుకోవటం దేశంలో ఇదే ప్రథమమని, వలంటీర్లకు ఏడాదికి రూ.2వేల కోట్ల ప్రజాధనం దోచిపెడుతున్నారని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించకపోతే ఉద్యోగాలు తీసేస్తామని టెక్కలికి చెందిన వైసిపి నేత వలంటీర్లను బెదిరించారని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేయొద్దని గతంలో ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాలంటీర్ల చేత ప్రచారం చేయించారని, దొంగ ఓట్లను నమోదు చేయించారని విమర్శించారు. ఇప్పుడు వైసిపి పోస్టర్లు, కరపత్రాలు అంటించేందుకు, ఇంటింటికీ పంచేందుకు గృహసారథులతో కలిసి పనిచేయాలని ఆదేశించారని వివరించారు. నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించి వలంటీర్ వ్యవస్థ దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు. టిడిపి నేత కొమ్మాలపాటి శ్రీధర్ అరెస్టు దుర్మార్గమని మరో ప్రకటనలో తెలిపారు.

జగన్ దోపిడీతోనే విద్యుత్ చార్జీల పెరుగుదల : కళావెంకట్రావు

జగన్ దోపిడీ వల్లే విద్యుత్ ఛార్జీలు పెరుగుతున్నాయని మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు విమర్శించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉండే జెన్‌కో, సిజిఎస్‌లో యూనిట్ విద్యుత్ సరాసరి రూ.5 లకే వస్తున్నా, కమీషన్ల కోసం బయట మార్కెట్‌లో రూ.9లకు కొనుగోలు చేశారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో కొనుగోళ్లకు ఖర్చు చేసిన రూ.12,200 కోట్లలో రూ.6వేల కోట్లు కమిషన్ దండుకున్నారని ఆరోపించారు. రూ.61 వేలు చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను రూ.1.30 లక్షలకు పెంచి జగన్ బినామీ కంపెనీ షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ వద్ద భారీ సంఖ్యలో కొనుగోలు చేశారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి : అనగాని

రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, వారిపై వేధింపులు ఆపాలని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. న్యాయపరంగా అమలు చేయాల్సిన డిమాండ్లను అమలు చేయకుండా మానసికంగా వేధింపు చర్యలకు దిగుతున్నారని పేర్కొన్నారు.

టిఎన్‌టియుసిని పటిష్టపరచాలి: అశోక్ బాబు

టిఎన్‌టియుసిని పటిష్టపరచాలని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన టిఎన్‌టియుసి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అబద్ధాలతో అధికారం చేపట్టి ఇసుక, మద్యం, మైనింగ్‌లలో అవినీతికి పాల్పడి లక్షల కోట్లు దోచుకున్నారని టిడిపి జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు అనుకూలంగా జగన్ నిర్ణయాలు తీసుకుంటున్నారని టిఎన్‌టియుసి అధ్యక్షులు జి రఘురామరాజు అన్నారు.

పెరగనున్న ఉష్ణోగ్రతలు

- సాధారణం కంటే 2నుంచి 4 డిగ్రీలు అధికం!
- పలు ప్రాంతాల్లో వేడిగాలులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంతోపాటు యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ దిశలో గాలులు వీస్తున్నాయి. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా రాబోయే 48 గంటల్లో సాధారణం కంటే ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల సెల్సియస్ నుంచి నాలుగు డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. అన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశముంది. ఈ మేరకు ఆదివారం అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఐఎండి అంచనాల ప్రకారం ఈనెల 10న అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏడు మండలాలు, అనకాపల్లి జిల్లాలో ఐదు మండలాలు, తూర్పుగోదావరి జిల్లాలో రెండు మండలాలు, ఏలూరు జిల్లాలో ఒక మండలం, కాకినాడ జిల్లాలో ఆరు మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఈనెల 11న అల్లూరి సీతారామరాజు జిల్లాలో 6 మండలాలు, అనకాపల్లి జిల్లాలో 7 మండలాలు, తూర్పుగోదావరి జిల్లాలో రెండు మండలాలు, ఏలూరు జిల్లాలో ఒక మండలం, కాకినాడ జిల్లాలో ఆరు మండలాల పరిధిలో వేడిగాలులు వీచే అవకాశముందని ప్రకృతి విపత్తులశాఖ పేర్కొంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో ఈనెల 11న అత్యధికంగా 45.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

అన్ని తరగతుల ప్రజలకు న్యాయం చేస్తాం

- యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తాము అధికారంలోకి రాగానే రైతులు, చేతి వృత్తిదారులు, ఉద్యోగులు, మహిళలు ఇలా అన్ని తరగతుల వారికీ చేయూత అందిస్తామని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర 65వ రోజు ఆదివారం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం జంబులదిన్నె వద్ద ప్రారంభమైంది. వెస్టు నరసాపురం, చిన్నజలాలపురం మీదుగా సోదనపల్లి క్రాస్ వరకు సాగింది. పలు ప్రాంతాలలో వివిధ తరగతుల ప్రజలు ఆయనను కలిసి మాట్లాడారు. 20, 30 పడకల ఆస్పత్రులను ఆరోగ్యశ్రీలో చేర్చాలని ప్రయివేటు డాక్టర్లు కోరారు. వేరుశనగ పంట సాగు చేస్తే పెట్టుబడైనా చేతికి రాలేదని రైతులు తెలిపారు. గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. విద్యుత్ మోటర్లకు మీటర్లు పెడితే మా బతుకులు కష్టమవుతాయని వాపోయారు. వాల్మీకులను ఎస్‌టిల జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. గొర్రెల పెంపకానికి పది ఎకరాల భూమిని గ్రామానికి కేటాయించాలని, వంద శాతం సబ్సిడీతో గొర్రెల షెడ్డు ఇవ్వాలని, కురబ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే రైతులకు తగిన న్యాయం చేస్తామన్నారు. వాల్మీకులను ఎస్‌టిల జాబితాలో చేర్చేందుకు టిడిపి హయంలో సత్యపాల్ కమిటీ నివేదిక వచ్చిందని, వైసిపి ప్రభుత్వం ఇంతవరకు దానిని బయటపెట్టలేదని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే కమిటీ నివేదికను పరిశీలిస్తామన్నారు. వడ్రంగి పనిచేసే విశ్వ బ్రాహ్మణులకు కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని లోకేష్ హామీనిచ్చారు. శింగనమల వద్ద చెరువుల్లో బోట్లలో స్వాగతం బ్యానర్లు పట్టుకుని టిడిపి నాయకులు స్వాగతం పలికారు. శింగనమల రామాలయం వద్ద క్రేన్ సహాయంతో గజమాల వేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణి, టూమెన్ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు ఎంఎస్.రాజు పాల్గొన్నారు.



పాదయాత్ర సందర్భంగా వెస్ట్ నరసాపురంలో రైతుతో మాట్లాడుతున్న నారా లోకేష్

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడితే వినియోగం తగ్గుతుందా?



ఎం. వేణుగోపాలరావు

మోడి ప్రభుత్వ విధానానికి అనుగుణంగా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ఎపి ఇపిడిసిఎల్ పరిధిలోని శ్రీకాకుళం సర్కిల్లో అమలు చేశారు. దీనివల్ల దాదాపు 30 శాతం మేరకు వ్యవసాయ విద్యుత్ వినియోగం తక్కువగా నమోదైనట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకు ప్రచారం చేసింది. ఈపథకం అమలు వల్ల శ్రీకాకుళం సర్కిల్లో మీటర్లు ఏర్పాటుకు ముందు, ఏర్పాటు తరువాత విద్యుత్ వినియోగంలో వచ్చిన తేడా, మీటర్లు పనిచేస్తున్న తీరు, ఈ కార్యక్రమం అమలు వల్ల ఒనగూరే లాభనష్టాల అంచనాలు, మీటర్ల కొనుగోలు, ఏర్పాటు, నిర్వహణకు అవుతున్న వ్యయానికి సంబంధించిన వివరాలను తెలియజేయాలని 2023-24 సంవత్సరానికి విద్యుత్ పంపిణీ కంపెనీల వార్షిక ఆదాయ అవసరాలు, ఛార్జీల ప్రతిపాదనలపై చేసిన నివేదనలలో కోరాము. ఈ అంశాలకు ఇపిడిసిఎల్ సమాధానాలను దాటవేసింది. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేసి, నేరుగా రైతులకు సబ్సిడీ అందించే (డిబిటి) కార్యక్రమం అమలు వల్ల చేకూరతాయంటున్న ప్రయోజనాలనబడే వాటిని ఇపిడిసిఎల్ తన సమాధానాలలో ఏకరువు పెట్టింది.

2022-23 సంవత్సరానికి ఇచ్చిన వివరణలో, శ్రీకాకుళం సర్కిల్లో 25,439 వ్యవసాయ సర్వీసులకు మీటర్లు ఏర్పాటు చేసినట్లు, మిగిలిన నాలుగు జిల్లాల్లో 2,07,920 వ్యవసాయ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే పనిని, అవసరమైన సామాగ్రితో అవార్డు చేసినట్లు డిస్కాం తెలిపింది. స్మార్ట్ మీటర్ల వల్ల వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గుతుందని డిస్కాం ఎక్కడా పేర్కొన లేదు. వ్యవసాయానికి రోజుకు 9 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీని (కొంత క్రాస్ సబ్సిడీని కలిపి) సమకూర్చి అమలు చేస్తున్నది. ఎపిఇఆర్‌సి అనుమతించిన ఐఎస్ఐ విధానం మేరకు వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని డిస్కాంలు లెక్కిస్తున్నాయి. కమిషన్ వాటిని పరిశీలించి, ఏ మేరకు వ్యవసాయ విద్యుత్ వినియోగం అవుతుందో ప్రతి ఏటా ఛార్జీల ఉత్తర్వులలో నిర్ధారిస్తున్నది.

రోజుకు నిర్ణీత తొమ్మిది గంటల కాలంలో వ్యవసాయానికి సరఫరా చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ ఫీడర్లకు ఏర్పాటు చేసిన మీటర్లలో నమోదైన వినియోగం ఆధారంగా వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని సగటున డిస్కాంలు లెక్కగడుతున్నాయి. వ్యవసాయ విద్యుత్ వినియోగం వ్యవసాయ సర్వీసుల సంఖ్య, వాటి మోటార్ల సామర్థ్యం, భూగర్భ జలాలు ఎంత లోతులో, ఏ మేరకు లభ్యమవుతాయి, అవి లభ్యమయ్యే బోరుబావులు, కాలువలు, వర్షపాతం, తదితర వనరులపై ఆధారపడి ఉంటుందని ఇపిడిసిఎల్ పేర్కొంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నందున, వ్యవసాయ సర్వీసులకు మీటర్ల ఏర్పాటును ప్రభుత్వ నిర్ణయం మేరకు డిస్కాంలు చేపడుతున్నాయని ఎపిఇఆర్‌సి పేర్కొంది. డిబిటి పథకం అమలుకు వినియోగాన్ని లెక్కగట్టేందుకు ఎల్‌టి వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు డిస్కాంలు పేర్కొన్నాయి.

వ్యవసాయ పంపుసెట్లకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి మీటర్ల ఏర్పాటుకు అనుకూలంగా చేస్తున్న సాంకేతిక వాదనలు ఏమైనప్పటికీ, దానివల్ల చేకూరే ప్రయోజనమేమిటనేది ప్రధానం. శ్రీకాకుళం సర్కిల్లో ఈ కార్యక్రమం అమలు వల్ల ప్రయోజనం చేకూరినట్లు నిర్ధారణ కాలేదు. ఇపిడిసిఎల్ అధికారిక గణాంకాల ప్రకారమే, 2020-21లో, 2021-22లో సర్కిల్ వారీగా ఎల్‌టి వ్యవసాయ విద్యుత్ వినియోగం (మి.యూ.) వివరాలు ఇలా ఉన్నాయి: (పట్టికలో చూడొచ్చు)

సంవత్సరం	శ్రీకాకుళం	విజయనగరం	విశాఖపట్నం	రాజమండ్రి	ఏలూరు
2020-21	103.820	116.069	132.638	498.562	1425.597
2021-22	65.596	146.380	182.197	493.225	1334.109
తేడా	-38.224	30.311	49.559	-5.337	-91.488

మీటర్లు ఏర్పాటు చేసిన శ్రీకాకుళం సర్కిల్లోనే గాకుండా, మీటర్లు ఏర్పాటు చేయని ఏలూరు సర్కిల్లో కూడా వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం, శ్రీకాకుళం జిల్లాలో పై రెండు సంవత్సరాలలో వరి పండించిన విస్తీర్ణం 13800 - హెక్టార్ల నుండి 7,600 హెక్టార్లకు తగ్గగా, వేరుశనగ వేసిన విస్తీర్ణం 4000 హెక్టార్ల నుండి 5800 హెక్టార్లకు పెరిగింది. మొక్కజొన్న వేసిన విస్తీర్ణం యథాతథంగా 14000 హెక్టార్లుగా ఉంది. జనుము వేసిన విస్తీర్ణం అదనంగా 13000 హెక్టార్లుగా నమోదయింది. అదనంగా 6000 హెక్టార్లలో నువ్వుల విస్తీర్ణం పెరిగింది. వ్యవసాయానికి నీటి వినియోగం తక్కువగా అవసరమైన పంటలను ఎక్కువగా వేయటం వల్ల శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది. ఇదేకాలంలో ఇపిడిసిఎల్ పరిధిలోని అయిదు సర్కిళ్లలో వ్యవసాయేతర విద్యుత్ వినియోగం పెరగగా, శ్రీకాకుళం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో పంపిణీ నష్టాల శాతం కొంత పెరిగింది.

2022-23లో వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కు కమిషన్ అనుమతించిన దానికన్నా మూడు డిస్కాంలలో వినియోగం తగ్గింది. ఇపిడిసిఎల్‌లో ఈ వినియోగం కమిషన్ అనుమతించిన 2715.35 మి.యూ. నుండి 2330.05 మి.యూ.కు (14.19 శాతం) తగ్గగా, ఎస్‌పిడిసిఎల్‌లో 7755.31 మి.యూ. నుండి 5909.63 మి.యూ.కు (23.80 శాతం), సిపిడిసిఎల్లో 2078.85 మి.యూ. నుండి 1962.76 మి.యూ.కు (5.58 శాతం) తగ్గిందని అంచనా.. ఇక్కడ కూడా ఇపిడిసిఎల్ కన్నా ఎస్‌పిడిసిఎల్‌లో వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గుదల శాతంగా కూడా ఎక్కువగా ఉంది.

2023-24లో కొత్తగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఎస్‌పిడిసిఎల్ 58013 మేరకు, సిపిడిసిఎల్ 50909 మేరకు, ఇపిడిసిఎల్ 14099 మేరకు ఇస్తామని ప్రతిపాదించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాను డిస్కాంలు ప్రతిపాదించిన దానికన్నా కమిషన్ తగ్గించింది. ఎస్‌పిడిసిఎల్ ప్రతిపాదించిన 6352.86 మి.యూ.ను 5909.63 మి.యూ.కు తగ్గించింది. సిపిడిసిఎల్‌కు సంబంధించి 2149.24 మి.యూ. నుండి 1962.76 మి.యూ.కు, ఇపిడిసిఎల్‌కు 2446.55 మి.యూ. నుండి 2330.05 మి.యూ.కు తగ్గించింది. 2023-24లో ఎస్‌పిడిసిఎల్ కొత్తగా 59018 వ్యవసాయ విద్యుత్ సర్వీసు కనెక్షన్లను ఇస్తామని ప్రతిపాదించగా, సిపిడిసిఎల్ 50909 కనెక్షన్లను, ఇపిడిసిఎల 14099 కనెక్షన్లను ఇస్తామని ప్రతిపాదించాయి. మీటర్ల ఏర్పాటు, ఎస్‌పిడిసిఎల్ ఇచ్చే కొత్త కనెక్షన్లలో దాదాపు నాల్గవ వంతు మాత్రమే కొత్త కనెక్షన్లు ఇవ్వనున్నా, ఇపిడిసిఎల్ వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గుదల శాతంగా కూడా ఎస్‌పిడిసిఎల్ తగ్గుదల కన్నా చాలా తక్కువగా ఉంది. మీటర్ల ఏర్పాటు వల్ల వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వినియోగం అంచనాలు కచ్చితంగా లెక్కగట్ట గలుగుతామని ఈ పథకం మద్దతుదారులు వాదిస్తున్నా, ఆ లెక్కలను బట్టి తక్కువ వినియోగం జరుగుతున్నదని నిర్ధారించే పరిస్థితి ఆచరణలో నిర్ధారణ కావటం లేదు. వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వథాగా ఖర్చు చేసి, ఈ పథకాన్ని అమలు చేయటం కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా తయారవుతున్నది.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 10 ఏప్రిల్ 2023



"వచన కవిత విచారణలో
ఉరిశిక్ష పడ్డ మొదటి ముద్దాయిని నేను
అలనాటి కవితాలతాంగిని హత్య చేశాను
అలంకార అభరణాలు అపహరించాను ."
– కుందుర్తి ఆంజనేయులు

ప్రజాసంస్కృతిని పెంపొందించే సాహిత్యం రావాలి

చర్చ

'సంస్కృతి' అంటే ఒక ఒక జాతి జీవన విధానం. ఇంగ్లీషులో సంస్కృతిని 'కల్చర్' అంటారు. కల్చర్ (సంస్కృతి) లాటిన్ పదం కల్చుర లేదా కొలెరె నుంచి వచ్చింది. దీని అర్థం 'సాగు'. కోలెరె అనే పదం అర్థం 'పండించడం'. దీనిని బట్టి ఈ పదాలు వ్యవసాయం చేయడం నుంచి ఉద్భవించాయని తెలుస్తుంది. ఒక సమాజంలో ఉన్న పద్ధతులు, నిర్మాణాలు, వ్యవస్థలు ఆ సమాజం యొక్క సంస్కృతిని సూచిస్తాయి. మధ్య యుగాల్లో సంస్కృతి అంటే భూమిని సాగు చేసే విధానం. పునరుజ్జీవనోద్యమంలో 'పండించిన' మనిషి వికాసంగా మారింది. అవి సాహిత్యం, లలిత కళలకు సంబంధించినదిగా మారింది. 19వ శతాబ్దంలో, సంస్కృతిలో మంచి, మర్యాదలు, ఆచారాలు కలిశాయి. ఇప్పుడు సంస్కృతిలో విలువలు, నమ్మకాలు, భాష, సమాచార వ్యవస్థలు కూడా వచ్చి చేరాయి. సంస్కృతి డైనమిక్‌గా ఉంటుంది. అంటే సంస్కృతిలోని అంశాలు రూపాంతరం చెందుతాయని అర్థం. అవి ఇతర సంస్కృతుల ప్రభావానికి లోనవుతాయి కూడా.

సంస్కృత భాషలో 'సంస్కృతి' అంటే 'సంస్కరణ చెందిన విషయం' అని అర్థం. సంస్కరణకు అర్థం చెడులో ఎంతో కొంత తగ్గించడం. ఆచారాలలో జరుగుతున్న చెడు పద్ధతులను కొంత మంచి మార్పు చేయాలని భావించేవారు సంస్కర్తలు. బ్రిటన్‌కు చెందిన ఎడ్వర్డు టైలర్ ప్రకారం సమాజంలో మానవులు అలవర్చుకున్న జ్ఞానమూ, నమ్మకాలూ, కళలూ, నీతులూ, చట్టాలూ, ఆచారాలు, అలవాట్లు, నైపుణ్యం, అవకాశం – ఈ విషయాలన్నింటినీ కలుపుకుని, ఆ సమాజం 'సంస్కృతి'గా నిర్వచించారు. టైలర్ దృష్టిలో సమాజం 'వర్గాల సమాజం' కాదు. వర్గభేదాల సంగతి అతనికి తెలియదు. యునెస్కో ప్రకారం ఒక సమాజానికి లేదా సమూహానికి చెందిన ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, లౌకిక, వైజ్ఞానిక, భావోద్వేగ అంశాలు ఆ సమాజపు సంస్కృతి అవుతాయి. ఒక సమాజం చేసిన, వాడిన పరికరాలు, నిర్మించిన కట్టడాలు, వారి సంగీతం, కళ, ఆహారం, శిల్పం, చిత్రం, నాటకం, నాట్యం, సినిమా – ఇలా సమాజపు జీవన విధానం ఆ సమాజపు సంస్కృతి అంటాం. ఒక సమాజంలో ఉన్న వస్తు వినియోగం, సంపన్నత, జానపద వ్యవహారాలు కూడా సంస్కృతిగా భావింపబడతాయి. వస్తువుల వినియోగమే కాకుండా ఆనాటి ఉత్పత్తి విధానం, వాటిని గురించిన దృక్పథం, సమాజంలో ఆ వస్తువులతోపాటు పెనవేసుకొని పోయిన సంబంధాలు, ఆచారాలు కూడా సంస్కృతి లోనివే. కనుక కళలు, విజ్ఞానం, నైతికత కూడా సంస్కృతి కిందకు వస్తాయి.

ప్రపంచీకరణలో భారతీయ సంస్కృతి శరవేగంగా మార్పులు చెందుతోంది. ఏ జాతి సంస్కృతి అయినా … దేని విశిష్టత దానిదే. కొందరు తమకు నచ్చిన కొన్ని అంశాలను ప్రమాణంగా పెట్టుకొని ఒక సంస్కృతి కంటే మరొక సంస్కృతి గొప్పదని తీర్మానిస్తుంటారు. ఇది సరైన దృక్పథం కాదు. కవి



బాలగంగాధర తిలక్ అన్నట్టు– 'యుగయుగానికి స్వభావం మారుతుంది/ అగుపించని ప్రభావాలకు లొంగుతుంది/ ఏ దేశ సంస్కృతి అయినా ఏనాడూ కాదొక స్థిరబిందువు / నైక నదీనదాలు అదృశ్యంగా కలిసిన అంతస్సింధువు'. ఉత్పత్తిక్రమం, ఉత్పత్తి సంబంధాలు సమాజ స్వరూపాన్ని నిర్ణయిస్తాయని మార్క్సిస్టులు భావిస్తారు. సమాజంలో ఉత్పత్తిదారుల అవసరాలకు సరిపడా సంపద మిగిలితే అది సంస్కృతి నిర్మాణానికి, పెంపుదలకూ మూలమవుతుంది. ఆయా కాలాల్లో అలాంటి మిగులు ఉత్పత్తి ఉండబట్టే చైనాగోడ, ఈజిప్టు పిరమిడ్లు నిర్మించటం సాధ్యమైంది. మిగులు ఉత్పత్తిని చేజిక్కించుకున్న పాలకుల సంస్కృతే పాలితుల సంస్కృతిగా ప్రచారంలోకి రావటం చరిత్రలో చాలాసార్లు జరిగింది.

చరిత్రలో భాగమే సంస్కృతి. సంస్కృతి నీడలా దానిని వెన్నంటి వుంటుంది. సంస్కృతికి సామ్రాజ్యవాదానికి గల గాఢమైన సంబంధాన్ని ఎడ్వర్డ్ డబ్ల్యు సెయిద్ కల్చర్ అండ్ ఇంపీరియలిజం అనే పుస్తకంలో విపులంగా చర్చించారు. ఆయన కొలంబియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు తులనాత్మక సాహిత్యాలను బోధించే ప్రొఫెసర్. సంస్కృతిలో రెండు అంశాలు ప్రాధాన్యం వహిస్తాయని ఆయన అంటారు. కళలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక విభాగాల్లో సమాజం సాధించిన అభివృద్ధి మొదటి అంశమైతే, రెండవది మానవుల అభిరుచి సున్నితమైన విషయాల్లో పెంపొందటం. కక్షలు కార్పణ్యాలతో నిండిపోయిన సమాజంలో సుఖశాంతుల్ని నెలకొల్పటం, సరైన సామాజిక అభిరుచుల్ని పెంపొందించటమే సంస్కృతిగా మేథ్యూ ఆర్నాల్డ్ భావించాడు.

సామ్రాజ్యవాదం ఇప్పుడు 'సబాల్టరన్ స్టడీస్'ను ప్రోత్సహించటం పేరిట వివిధ జాతులు తమ మూలాలను అన్వేషించి, తెలుసుకొని, తమ జాతుల ఐడెంటిటీని నిలబెట్టుకోవాలని ప్రచారం చేస్తున్నది. ప్రపంచాన్ని చీలదీసే ప్రయత్నంలో అపారమైన నిధుల్ని కుమ్మరిస్తోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నిధులు యువతరాన్ని ఎక్కువగానే ఆకట్టుకుంటున్నాయి. దీనివల్లే నేడు అనేక అస్థిత్వ వాదాలు పుట్టుకొచ్చాయి. నూరేళ్ల సామ్రాజ్యవాదం తన సంక్షోభాన్నుంచి బయటపడటానికి ప్రపంచీకరణ ప్రక్రియను ప్రారంభిస్తే అది ఢిల్లీ నుండి పల్లె వరకు పేద, మధ్య తరగతి ప్రజానీకాన్నేకాక, భౌతిక విలాసాల్లో బతికేస్తున్న సంపన్న వర్గాల్లో కూడా మనశ్శాంతి లేని సాంస్కృతిక సంక్షోభాన్ని సృష్టించింది. టీవీ సీరియళ్ల నిండా కోటీశ్వరుల కుటుంబాలే దర్శనమిస్తాయి. అవి ఎప్పుడూ పగతో, ప్రతీకారంతో, పోటీ, ఈర్ష్యాసూయలతో, పచ్చి స్వార్థంతో రగిలిపోతూ వుంటాయి. మౌఢ్యాలతో మునిగితేలుతుంటాయి. భయంకరమైన కుళ్లు సంస్కృతిని దేశమంతా వెదజల్లుతుంటాయి. కాకుంటే దాని ప్రభావం నుంచి బయటపడాలంటే 'ప్రపంచీకరణ' విలువలను తిరస్కరించే ప్రత్యామ్నాయ సంస్కృతికే సాధ్యపడుతుంది. ఒక కవి ప్రస్తుత పరిస్థితుల్ని ఇలా చెపుతాడు : 'వేల మైళ్ల దూరంలో మనిషికి మనిషికీ మధ్య ఇంటర్నెట్/ ఒకే గదిలో మనసుకూ మనసుకూ మధ్య వేల మైళ్లు'. ఇదీ నేటి వర్తమాన సంస్కృతి!

గ్రామాల్లో, పట్టణాల్లో, పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో ప్రపంచీకరణ సంస్కృతి వెలుగులు నింపిందా, చీకట్లు పంచిందా చర్చించుకుంటేగానీ మనమెక్కడ ఉన్నామో అర్థం కాదు. మానవీయ విలువలైన కరుణ, దయ, జాలి, సాటి మానవుల పట్ల సానుభూతి, సంఘీభావం పెరిగాయా, తరిగాయా ఆలోచించాలి. కుటుంబ జీవితంలో భార్యభర్తల మధ్య, అత్తాకోడళ్ళ మధ్య, తల్లితండ్రులు బిడ్డల మధ్య సంబంధాల్ని ఏ విలువలు నడిపిస్తున్నాయో అవి కుటుంబ సౌఖ్యాన్ని పెంపొందిస్తున్నాయో లేదో పరిశీలించాలి.

భాష అనేది సంస్కృతిలో ఒక ముఖ్యమైన అంశం. తమ తమ భావోద్వేగాలను ప్రజలు తమ మాతృభాషలోనే మనస్ఫూర్తిగా ఇతరులకు తెలియ చేయగలుగుతారు. వీటిని పరాయి భాషలో అంత శక్తివంతంగా వ్యక్తీకరించలేరు. కెన్యా రచయిత గూగీవా థియాంగో చెప్పినట్లు తుపాకీ శరీరాన్ని వశపరుచుకుంటుంది. భాష ఆత్మను వశపరచుకుంటుంది. ఇది మనభాషా సంస్కృతుల పరాయీకరణ గురించి తెలుపుతుంది. ఉదాహరణకు మమ్మీ, డాడీ, ఆంటీ, అంకుల్ అనేవి పరాయి భాషా పదాలు. అమ్మా, నాన్న అనే పదాలకున్న శక్తి మమ్మీ, డాడీలలో ఉండదు. అవి కేవలం పిలుపులుగానే ఉంటాయి. పెద్దమ్మ, చిన్నమ్మ, పిన్ని, బుల్లెమ్మ, అత్త, మేనత్త అన్న రకరకాల బంధుత్వాలకు తెలుగులో విడివిడిగా పదాలుండగా ఇంగ్లీషులో 'ఆంటీ' అనే పదం ఒక్కటే ఉంది. పెదనాన్న, బాబాయి. చిన్నాన్న, మామ, మేనమామలకు బదులుగా ఇంగ్లీషులో అంకుల్ అనే పదం ఒక్కటే ఉంది. ఫలితంగా ఆ ఇంగ్లీషు పదాలు వాడుతున్న సందర్భంలో భావం ఖచ్చితంగా వ్యక్తీకరింపబడదు. ఆంటీ, అంకుళ్ళ సంతానమంతా ఇంగ్లీషులో 'కజిన్స్' అవుతారు. తెలుగులో అయితే అన్న, తమ్ముడు, అక్క, చెల్లెలు, వదిన, మరదలు, భావ, బావమరిది ఇలా బహుముఖంగా ఉంటాయి. ఇది బంధు సంబంధాల్లో ఎక్కువ ఖచ్చితత్వాన్ని తెలుపుతుంది. 'ఆంటీ', 'అంకుల్' పిలుపుల్లో ఈ ఖచ్చితత్వం లేక, మన సంబంధాలు పరాయీకరణ చెందుతాయి.

అభ్యుదయవాదులు సమాజ ప్రయోజనం కోసం కళారూపాల్ని, సాహిత్యాన్ని ఉపయోగించాలని అన్నప్పుడు... సంప్రదాయవాదులు దాన్ని ప్రచారం కోసం చేస్తున్న కళలుగా చిత్రిస్తుంటారు. వందల సంవత్సరాలుగా కుప్పలు తెప్పలుగా వచ్చిన భక్తి సాహిత్యం కూడా భక్తి ప్రచారమే. భాగవతం వైష్ణవ మత ప్రచారం కోసమైతే, బసవ పురాణం శైవమత ప్రచారం కోసం రాశారు. బైబిలు క్రైస్తవ మత ప్రచారం కోసమైతే, ఖురాన్ ఇస్లాం మతం ప్రచారం కోసం రాశారు. అందువల్ల అభ్యుదయకరమైన మానవీయ సంస్కృతి నుంచి పెంపొందించే సాహిత్యాన్ని ప్రచారసాహిత్యమని కొట్టి పారేయడం సరైంది కాదు. సాహిత్యంలో, సినిమాల్లో అశ్లీల, భయానక అద్భుత ఘటనలు చొప్పించి ధనార్జన చేయడంతో పాటు వాటిని అపురూప కళాసృష్టిగా చలామణీ చేయడం నిత్యమూ గమనిస్తున్నాం. అలాంటప్పుడు సమాజశ్రేయస్సు కోసం, ఒక ఉన్నతమైన సమసమాజం కోసం సాహిత్య సృష్టి, కళా ప్రదర్శనలు దోహదపడితే వాటిని స్వాగతించాలి. మరింతగా విస్తృతపరచాలి.

పెట్టుబడిదారీ సమాజంలో కళల్ని 'మార్కెట్' సంస్కృతిలోకి లాగేస్తున్నారు. సినీరంగ ప్రముఖులంతా కళాకారులే. కానీ వారు తమ రంగాన్ని 'వ్యాపారం'గా, 'పరిశ్రమ'గా గర్వంగా చెప్పుకుంటారు. ఆటలు కూడా (ఉదా. క్రికెట్, టెన్నిస్) వ్యాపారంగానే మారిపోయాయి. వ్యాపార సంస్థలకు ప్రచార సాధనాలు అయిపోయాయి. పెద్ద పెద్ద కంపెనీలు మహిళల సౌందర్యాన్ని వస్తువుల అమ్మకానికి వినియోగించుకుంటున్నాయి. అందాల పోటీల నిర్వహణ వెనుక వున్నది కూడా ఈ వ్యాపార సంస్కృతే. కాబట్టి ఏ పదజాలం వెనుక ఎలాంటి భావజాలం దాగుందో గ్రహించాలి. ప్రచారకళల పేరుతో ప్రజాకళల్ని తక్కువ చేసే సంస్కృతిని వ్యతిరేకించాలి. అదే సందర్భంలో శిల్పనైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా ప్రజాకళలను పదును పెట్టుకోవాలి. ఫ్రెంచ్ సామాజిక శాస్త్రవేత్త పియర్ బోర్డియు ప్ర కారం … 'విద్య ఆధిపత్య తరగతి సంస్కృతిని శాశ్వతం చేస్తుంది'. దీన్నే అతను 'సాంస్కృతిక పునరుత్పత్తి' అన్నాడు. మన సమాజంలో ఆధిపత్య వర్గాల సంస్కృతి, లింగ అసమానత, ఇతర సామాజిక సంస్కృతి లక్షణాలు యువతరాలనికి బదిలీ చేయబడుతుంటాయి. దీన్ని గుర్తించి సరైన ప్రజా సంస్కృతి వ్యాప్తికి సాహిత్యకారులు, అభ్యుదయవాదులు కృషి చేయాలి.

– పిళ్లా కుమారస్వామి
94901 22229



భూమిని మాటాడనివ్వు ..

మనమింకా బతికే వున్నామా?
ఇదేదో భేతాళుని
భుజాన వేలాడే రాజు ప్రశ్న కాదు

వాదనలు ముగిసిన వేళ
వాడొక్క మాటతో ఫుల్ స్టాప్
పెట్టేసే వేళ
అటూ ఇటూగా సరిపెట్టుకుంటే
నువ్వూ నేనూ కోల్పోయేదేమీ లేదు
వాడి తుపాకీ మొన ముందు
వారి మానం ఛిద్రమైన వేళ
కోర్టుల ముందు
నగ్నంగా నిలబడిన
తల్లులను వంచించిన
నీ న్యాయం
నీకు నైతిక విజయమా?
కోల్పోయిన మానానికి
కళ్ళు లేని న్యాయం
ధర కడుతుందా?
తాను రుజువు చేయలేని
ఆ పదముగ్గురినీ
వాకపల్లిలో నిలబెడితే
న్యాయమేదో బిగ్గరగా
వినబడేది కదా?
పదారేళ్ళ నీ విచారణకు
తమ కొంగు చివర
కట్టుకున్న దమిడీ బిళ్ళ
ఫీజు చెల్లుబడేయ్యేది కదా
నల్ల గౌను పోలీసూ?
తిప్పి తిప్పి
నువ్ వాళ్ళు చదవమన్న
తీర్పు చదివి
కళ్ళు తుడుచుకుంటే
పోయిన మా నెత్తుటి ముద్దుబిడ్డ
డానియెల్ ప్రశ్న నీకెరుకవుతుందా?

భూమిని మాటాడనివ్వు
సత్యమేదో సూరీడు
ప్రకటిస్తాడు!

– కెక్యూబ్ వర్మ
9493436277



మానవతాలోకం

రాశులై పోగుపడే ద్వేషాన్ని చూసి
నదులై పారే విరోధ భావాల్ని చూసి
ఏమిటీ లోకమంటూ
శోకించినాను
గమనమెటులనోనని
మధనపడ్డాను
పరికించి చూడగా అర్థమైంది
సమాజమే ఓ మానవతా కడలియని
కలత చెందుట వ్యర్థమని
కాలుష్యపు కాలువలెన్ని కలిసినా
కలుషితం చేయడం అసాధ్యమని.
ఉత్సాహినై ఎగసి
స్వచ్ఛమైన మంచు బిందువుల్ని తెచ్చి
నా వంతుగా చేర్చినాను
కడలి నవ్వింది కల్మషం లేకుండా
అలలు అలలుగా ...

– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ,
94408 36931



జైలు కలగంటుంది

బహుశా పహరా కాస్తున్న సెంట్రీ పరాధీనంగా
ఉన్నప్పుడో
లాఠీలు పనిమాని మూలసేద తీరుతున్నప్పుడో
గురిచూసి గురి చూసి తుపాకీ అలసి రెప్పవాల్చినప్పుడో
ఉన్న సన్నని మసక కాంతి కూడా కంటిలో
కరిగిపోయినప్పుడో
గదులు నిండిన ఏడుపులో
దుఃఖపు గీతాలో ఆగినప్పుడో
గడ్డకట్టుకుపోయిన నెత్తుటి మరకలు ఆరుతున్నప్పుడో
బతుకు మీద ఆశ చచ్చిపోయి
అన్నం మెతుకే ఆఖరి కోరిక అయినప్పుడో
జైలుకలగంటుంది తొలిసారిగా మేల్కొని ...
గొంతు తెగిన ఉరితాడు సత్యం పలికినట్టు
ఊడిగం పోయి ఊచల నాడులు చైతన్యంతో కదిలినట్టు
తెగిన సంకెళ్ళ చేతులు బార్లా చాచి గాలిలో
విహరించినట్టు
పక్షి రెక్కపట్టుకొని ఆకాశానికి ఎగిరినట్టు
ఆంక్షలు తొలగి కాంక్షలు తీరినట్టు
కన్నీటి కథలు చెరిగి
కలలు నెరవేరినట్టు
జైలు రేపటిని కలగంటుంది
గోడలు లేని అడ్డుగోడలు ఉండనీ
ఆరుబయలును కలగంటుంది జైలు!

– లోసారి సుధాకర్

చిగురు కల

డబ్బు మనిషికి స్వార్థాన్ని నేర్పినట్లే
భూమికి దాహాన్ని నేర్పుతుంది ఎండ
ఎండిన కాలువలన్నీ దాహంతో
నీటికోసం అలమటిస్తున్నాయ్
దొంగ మబ్బులు బెదిరిపోయి
దూరంగా పరుగులు తీస్తూ
తూర్పు దిక్కుని వదిలి పారిపోయి
పడమటి కొండల వెనక్కి దాక్కుంటున్నాయ్

గొప్పగా దాహం పెరుగుతూనే ఉంది
నేల పగుళ్ళు తెరుచుకుంటూనే ఉన్నాయ్
ప్రకృతి గమనం ఎండకు మందగిస్తుంది
ఆకునైనా పలకరించలేని అసహాయంతో
గాలి కదలటం చాతకాక స్తంభిస్తుంది


ఎండకు భూమి నోరు విచ్చుకుంది
ఒక్కటంటే ఒక్కటీ చినుకు పడిందా
నిస్సారమై పోయిన భూమికి
మళ్ళీ ప్రాణం పోస్తుంది
భూమి రాబోయే నీటిని తాగి తాగి
కడుపు పండించుకుని
మరో ఏడాదికి మళ్ళీ పంటని ఇస్తుంది

మనిషైనా అంతే కదా
నిస్సహాయంగా నిర్జీవంగా మారి
పలకరించే దిక్కులేక ప్రేమరాహిత్యంతో
నెర్రెలు విచ్చిన మనసుపై
ఒక్క ఆత్మీయ బిందువును చిలకరించి చూడు
తిరిగి పునర్జీవితాన్ని పొంది
స్వప్నాలు చిగుర్లు వేస్తాయి!

– శీలా సుభద్రాదేవి
81068 83099

సామాజిక సమస్యలపై అక్షరాస్త్రం

పుస్తకం



గోలి మధు కలానికి పదును, దూకుడు కూడా ఎక్కువే. ఆయన కవిత్వంలో అక్షర, పద విన్యాసాలు కనిపిస్తాయి. పదాలలో ఎంత పొదుపో, భావాలలో విస్తృతి అంత ఎక్కువ. ఈ విషయంలో ఉపాధ్యాయురాలైన ఆయన అమ్మ గారి ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. అభ్యుదయ కవిగా పేరు గడించిన గోలి మధు ప్రగతిశీల కవిత్వం రాయడంలో దిట్ట. భారతీయ ధర్మ విశ్లేషణ (2003), నవశకం (2006), రైతు సమరభేరి (2020, 2021), గమనం (2021) వంటి కవితా సంకలనాలు అందించారు. పుస్తకాలకు కాలం చెల్లిందనుకుంటున్న రోజుల్లో 2020లో వచ్చిన ఆయన రైతు సమరభేరి' కవితా సంపుటి 2021లో రెండవ ముద్రణకు నోచుకోవడం విశేషం. అదే ఆవేశంతో, పదునెక్కిన ఆలోచనలతో తనలో తను ఘర్షణ పడి 38 కవితలతో 'సంఘర్షణ' అనే కవితా సంకలనం తెచ్చారు. సమాజంలోని రుగ్మతలను సరిదిద్దాలన్న మధు ఆలోచనల్లో నుంచి పుట్టుకొచ్చిందే ఈ 'సంఘర్షణ'. 2020 నుంచి 2023 జనవరి వరకు రాసిన కవితలు ఇందులో ఉన్నాయి.

అభ్యుదయ సాహితీవనంలో విరబూసిన ఎర్ర గులాబీ గోలి మధు. ఆయన ఉవ్వెత్తున లేచే కెరటం. ఓ మెరుపు. మధు భాషా – భావం రెండూ పదునైనవే. అతి సాధారణ పదాలలో అద్భుతమైన భావం పలికించగల కవి. ఆయన కవిత్వంలోని సారాన్ని ఎవరికి వారు ఆస్వాదించవలసిందే. 'అక్షరానికి ఆవేశం చల్లారింది. అందుకే.. ప్రశ్నించడం మానేసింది.' అన్నారు. ఇందులో నుంచి ఎన్ని అర్థాలు స్ఫురిస్తాయో! ప్రశ్నించడం మానేసినా, ఆలోచించడం మానకూడదు. 'అక్షరానికి పక్షపాతం ఆవహించింది, అందుకే పక్షవాతంతో కులమతాల చిచ్చులకు ఆజ్యమైంది' అని స్పష్టం చేశారు. మరోచోట 'పీడితులే నా కలానికి ఆరాధ్యులు. దేశం గుండెఘోష నా సిరా. పీడకులపైనే నా కలం దాడి. దేశం గుండెల్లో, పీడితుల ఎదలో రగిలే జ్వాల ఈ సంఘర్షణ. అడుగడుగునా అంధకారం ఆవరిస్తే, అక్షరం దీపమై అడుగులు మొదలుపెట్టాలి' అంటాడు మధు.

అక్షరాలు అరుణ వర్ణం కోల్పోయాయని, అవి తల్లక్రిందులవడంతో దేశ సంపద కొందరి చేతుల్లోకి వెళుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య భారతదేశ సంపదంతా ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ల కబంధ హస్తాల్లో ఒదిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందరికీ తెలిసిన నడుస్తున్న చరిత్ర ఇది. 'సంక్షోభంలోకి దేశం దిగజారుతున్నా పాలన మారనందుకు చోద్యంగా ఉంది' అని ఆందోళన వ్యక్తం చేశారు. గగ్గోలు పెట్టారు. 'చైతన్యరహితమైన సంఘాన్ని చూస్తే భయమేస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం ఎంత చైతన్యహీనంగా తయారైందో స్పష్టంగా చెప్పారు.

'గుండ్రని నా అక్షరం దొర్లుతూ వెళితే,
పీడితుల పాదాలు తాకే పూల చెండు!
దూసుకెళితే పీడకులపై దాడిచేసే ఫిరంగి గుండు!'

సమాజంలో ఉన్న అన్ని అంశాలపై ఆయన కవితలు రాశారు. రాస్తున్నారు. వాటిలో రైతుల వెతలు తప్పక ఉంటాయి. రైతు ప్రాధాన్యతను మధు అంతగా గుర్తించారు. రైతంటే ఆయనకు వల్లమాలిన ప్రేమ, అభిమానం. దేశ వెన్నెముక వెన్ను విరుస్తూ 700 మంది రైతుల బలిదానాలకు కంట తడి చూపలేని అంధ దేశభక్తుడిని అని తనను తాను తిట్టుకున్నాడు. బోధన విషయానికి వస్తే, 'లోకం పోకడ నేర్పక, మనసుకు జ్ఞానం ఇంకక, బట్టీపట్టే ర్యాంకుల పంటలే అగుపిస్తాయిక్కడ!' అని నేటి చదువుల తీరును ఎండగట్టారు. చిన్నప్పటి నుంచి పెట్టుకునే నుదుట బొట్టును ఆయన రాలిపోగానే తుడిచేస్తారెందుకు?' అని ప్రశ్నించారు. "వాడెవడో మనువంట– మగడు మరణించాక–మగువకు మనుగడ ఎందుకంటూ మరణ శాసనం రాశాడు' అని మండిపడ్డాడు. సమాజంలో మహిళల స్థానం, వారి ఆక్రోశం, ఆలోచన, ఆశలను చక్కగా, స్పష్టంగా తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల విషయంలో 'గడపదాటి గద్దించండి, స్త్రీ శక్తితో అధికారానికి అసలు అర్థం చెప్పండి' అని మహిళలకు పిలుపునిచ్చాడు.

చేవ చచ్చి, చైతన్యం లోపించి నీరుగారిపోతున్న పోరాటాలకు సరికొత్త ఒరవడి అద్దిన ఉద్యమరైతుని శ్లాఘించారు. అధికార మదాంధుల వెన్నులో వణుకు పుట్టించిన దేశం వెన్నెముకగా ఉద్యమ రైతుని పోల్చి సలాం చేశారు. 75 ఏళ్లుగా నాయకులు ఇచ్చే స్థితిలోనే ఉన్నారని, ప్రజలు మాత్రం పుచ్చుకుంటూ ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారని నేటి రాజకీయాలు, ఆ రాజకీయాల్లో ఓటర్ల తీరును చక్కగా వర్ణించారు. పుస్తకం మొత్తం చదివితే కవి ఎవరెవరితో, ఏ రకమైన ఆలోచనలతో, సామాజిక పరిస్థితులతో, తనలోని తనతో.... ఎన్ని విధాల సంఘర్షణ పడ్డాడో తెలుస్తుంది. ఎంత అంతర్మథనం పడ్డాడో అర్థమవుతుంది. ఆ సంఘర్షణలో నుంచి మెరుపులు వచ్చాయి. ఉవ్వెత్తున పడిలేచే కెరటాలొచ్చాయి. ఆవేశం, ఆక్రోశం వచ్చాయి. కొత్తకొత్త ఆలోచనలు వచ్చాయి. కొత్త కొత్త పదాలు పుట్టుకొచ్చాయి. అలా ఈ 'సంఘర్షణ' కవిత్వం పుట్టుకొచ్చింది. ప్రతులకు 9848199098 నెంబర్లో సంప్రదించొచ్చు.

– శిరందాసు నాగార్జున రావు,
94402 22914

అరసం యువ వచన కవితా పోటీలు

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, విశాలాంధ్ర దినపత్రిక సంయుక్తంగా యువ కవులకు వచన కవితా పోటీలు నిర్వహిస్తున్నామని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్తమాన రాజకీయ సామజిక అంశాలపై 30 పంక్తులకు మించని కవితలు, ఒకరు ఒకటి మాత్రమే ఏప్రిల్ 27 లోగా పంపాలని, కవుల వయసు 30 సంవత్సరాలు మించరాదని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 1500, 1000, 750 లను అందిస్తారని తెలిపారు. కవితలను పంపాల్సిన చిరునామా : అరసం, 401 శ్రావణి రెసిడెన్సీ, 6/3, ఎస్ వి ఎన్ కాలనీ, గుంటూరు – 522006. ఫోను : 92915 30714

16న వి.చంద్రశేఖరరావు పురస్కార ప్రదానం

16 ఏప్రిల్ 2023 ఆదివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్లో డాక్టర్ వి.చంద్రశేఖర రావు సాహిత్య పురస్కారం–2023ను యువ కథకుడు వి.మల్లికార్జున్ కు ప్రదానం చేస్తారు. వాసిరెడ్డి నవీన్ అధ్యక్షత వహించే ఈ సభలో కె.శివారెడ్డి, వి.ప్రసూన, కాత్రగడ్డ దయానంద్, ఎ.కె.ప్రభాకర్, పర్ణ తోట పాల్గొంటారు.

– డాక్టర్ వి.ప్రసూన,
డాక్టర్ వి.చంద్రశేఖర రావు సాహిత్య కుటుంబం

23న 'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ

విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 23 ఏప్రిల్ ఉదయం 10 గంటలకు స్థానిక విశాఖ పౌర గ్రంథాలయంలో 'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ జరుగుతుంది. 56 మంది రచయితల కథతో ఈ పుస్తకాన్ని ఎన్ కె బాబు ప్రచురించారు. కవి, ప్రముఖ వైద్యులు ఈదర పెద వీర్రాజు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. శ్రీహరిరాజు, అడపా రామకృష్ణ, డా.మరడాన సుబ్బారావు, ఎస్. హనుమంతరావు, సర్వేశ్వర శాస్త్రి, మేడా మస్తాన్ రెడ్డి, శిరేల సన్యాసిరావు ప్రసంగిస్తారు.

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

చేద్దామంటే కొలువే లేదు !

- అరకొర వేతనాలు, అభద్రత
- ఏ రంగంలో చూసినా ఇదే పరిస్థితి
- పడిపోతున్న వినియోగ వ్యయం
- వాస్తవాల వక్రీకరణలో ప్రభుత్వ అనుకూల ఆర్థికవేత్తలు
- వ్యవసాయంలో కొంత మెరుగు

'ఏ రంగం చూసినా ఏమున్నది గర్వకారణం.. సర్వం కార్పొరేట్ మయం..ప్రజల బతుకులు వీధులమయం..' అన్నట్టుగా మోడీ సర్కారు తీరు ఉందనడానికి దేశంలో కుంచించుకు పోతున్న ఉపాధే ప్రత్యక్ష తార్కాణం. చేద్దామంటే కొలువు లేదు. ఉన్నా అరకొర వేతనమే. అదీ అభద్రతామయమే. ఏపూటకాపూట అన్నట్టు నెట్టుకొస్తున్న పరిస్థితి. ఉప్పూ, పప్పూ, తొక్కూ, నూనె ఇలా ప్రతి దాంట్లోనూ పొదుపే. రెండు కొనేదగ్గర ఒకటి కొంటూ జీవితాలను నెట్టుకొస్తున్న దుస్థితి. ప్రతి ఇంటా జరుగుతున్న రామాయణమూ ఇదే. ఓవైపు పెరుగుతున్న నిరుద్యోగ సమస్య..మరోవైపు తగ్గిపోతున్న వినియోగ వ్యయం...ఇంకోవైపు పేదల బతుకులు అస్తవ్యస్తంగా ఉంటే...వాస్తవాలను వక్రీకరిస్తూ 'భారత్ వెలిగిపోతుంది..అచ్చేదిన్' అంటూ ప్రభుత్వ అనుకూల ఆర్థికవేత్తలు తమ భజన కొనసాగిస్తూనే ఉన్నారు.



న్యూఢిల్లీ : కోవిడ్ మహమ్మారి సృష్టించిన కల్లోలం నుంచి ప్రజానీకం ఇంకా తేరుకోలేదు. ఓ వైపు ప్రజల వినియోగ వ్యయం తగ్గిపోతుంటే మరోవైపు ఉపాధి లేక యువత అల్లాడిపోతున్నది. వాస్తవానికి వినియోగ వ్యయానికి సంబంధించిన గణాంకాలు 2011-12 నుంచి అధికారికంగా అందుబాటులో లేవు. దీనిపై 2017-18లో సేకరించిన వివరాలను ప్రభుత్వం ఇప్పటివరకూ విడుదల చేయకుండా తొక్కిపెట్టింది. పైగా అదంతా తప్పులతడక అని ప్రచారం చేస్తున్నది. వినియోగ వ్యయం పడిపోతోందంటూ వచ్చిన ఈ నివేదిక మీడియాలో వెలుగు చూసినా అధికారులు మాత్రం అందుకు అంగీకరించడం లేదు. ఉపాధికి సంబంధించిన గణాంకాల సేకరణకు గతంలో అనుసరించిన పద్ధతికి సైతం స్వస్తి చెప్పారు. దీనివల్ల అన్ని వివరాలూ బయటకు రావడం లేదు.

భారత ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తున్న ప్రయివేటు సంస్థ సీఎంఐఈ అందించిన సమాచారాన్ని విశ్లేషిద్దాం. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఈ సంస్థ అత్యంత వేగవంతమైన సమాచారాన్ని ఇస్తున్నది. అధికారిక గణాంకాలేవీ అందుబాటులో లేకపోవడంతో సీఎంఐఈ అందించిన సమాచారమే కీలకమవుతున్నది. గణాంకాల మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం మాదిరిగానే ఈ సంస్థ కూడా నమూనాలను సేకరిస్తున్నది. వీటి ప్రకారం... 2019 మార్చి నుంచి 2023 మార్చి వరకూ దేశంలో కొత్తగా 50 లక్షల ఉద్యోగాలను కల్పించారు. మొదటిసారి లాక్‌డౌన్ విధించినప్పుడు ఉద్యోగాల కల్పన బాగా పడిపోయింది. ఆ తర్వాత కూడా ప్రభుత్వ అనుకూల ఆర్థికవేత్తలు చెబుతున్నట్టు పరిస్థితి అద్భుతంగా ఏమీ మారలేదు. ఉద్యోగాల కల్పన రేటు మెరుగుపడకపోగా దారుణంగా దిగజారింది.

కొత్త ఉద్యోగాల సంగతేంటీ..?

నాలుగేండ్ల కాలంలో కేవలం 10.25 లక్షల ఉద్యోగాలు మాత్రమే కొత్తగా వచ్చి చేరాయి. అంటే ఏటా 0.3 శాతం వృద్ధి మాత్రమే కన్పించింది. ఇది దిగ్భ్రాంతి కలిగించే విషయం. జనాభా పెరుగుదల రేటుతో పోలిస్తే ఇది చాలా తక్కువ. దేశంలో పనిచేసే వారిలో ఉద్యోగులే కాదు... వివిధ రంగాలలో పనిచేసే కార్మికులు కూడా ఉంటారు. గడిచిన నాలుగేండ్ల కాలంలో కార్మికుల భాగస్వామ్య రేటు పడిపోతూ వస్తున్నది. 2019 మార్చిలో ఈ రేటు 42.7 శాతం ఉంటే 2023 మార్చి నాటికి 39.8 శాతానికి తగ్గింది. గతేడాది నుంచి మాత్రం కొంత పెరుగుదల కన్పించింది. ఉద్యోగ సంక్షోభంలోని వాస్తవిక పరిస్థితిని కార్మిక భాగస్వామ్య రేటు ప్రతిబింబిస్తుంది. నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుంటే ఉపాధి కల్పనలో వృద్ధి నెమ్మదించింది. ఇది వారిని తీవ్రమైన నిరాశానిస్పృహలకు లోనుచేస్తోంది. ఉపాధి కోసం వెతకడం కూడా మానుకుంటున్నారు. మహిళల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కన్పిస్తోంది. ఎందుకంటే వారికి వేతనాలు తక్కువగా లభిస్తున్నాయి. ఉద్యోగ భద్రత లేకుండా పోతోంది.

చేసే సామర్థ్యమున్నా...చేతిలో పనేదీ ?

పనిచేయగల వయసున్న వారి సంఖ్య దేశంలో గణనీయంగా పెరుగుతున్నది. వారికి ఉపాధి చూపాల్సిన బాధ్యత పాలకులదే. అధికారిక గణాంకాల ప్రకారం 15 ఏండ్లు వయస్సు దాటిన వారు పనిచేయగలరు. దీని ప్రకారం ఈ వయస్సుకు చేరే వారి సంఖ్య ప్రతి ఏటా 1.2 కోట్ల మేర పెరుగుతుందని అంచనా. వీరిలో 50 లక్షల మంది పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అంటే ఏటా 50 లక్షల అదనపు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉంది. కానీ, గడచిన నాలుగేండ్ల కాలంలోనూ కొత్తగా వచ్చిన ఉద్యోగాలు కేవలం 50 లక్షలు మాత్రమే ! 'దేశంలో ఉపాధి కల్పన అస్థిరంగా ఉంది' అని సీఎంఐఈ అధిపతి మహేష్ వ్యాస్ అంటున్నారు. నిర్మాణ రంగంలో మార్చిలో 95.8 లక్షల మంది ఉపాధి కోల్పోయారు (7.23 కోట్ల నుండి 6.28 కోట్లకు). రిటైల్ వ్యాపార రంగంలోనూ ఇదే పరిస్థితి. ఫిబ్రవరిలో ఈ రంగంలో 7.58 కోట్ల మంది పనిచేయగా మార్చి నాటికి ఆ సంఖ్య 6.78 కోట్లకు తగ్గిపోయింది. అంటే ఒక్క నెలలో 80 లక్షల మంది వీధినపడ్డారు.

ఆశాజనకంగా వ్యవసాయరంగం

వ్యవసాయ రంగంలో మాత్రం పరిస్థితి ఆశాజనకంగానే ఉంది. అనుబంధ పౌల్ట్రీ, ప్లాంటేషన్ రంగాల నుంచి వ్యవసాయ పనులకు మళ్లుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఆయా రంగాల నుంచి 60 లక్షల మంది పొలం పనులకు దిగుతున్నారు. మార్చిలో ఇతర రంగాల నుంచి 2.3 కోట్ల మంది వ్యవసాయం వైపు మళ్లారు. దీనివల్ల పంటల దిగుబడులు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో కార్మికులకు మెరుగైన వేతనాలు లభించవచ్చు. ఆదాయం సరిగా లేకపోవడం, అభద్రత కారణంగా కార్మికులు పెద్ద సంఖ్యలో వ్యవసాయం వైపు చూస్తున్నారని మహేష్ వ్యాస్ చెప్పారు. వ్యవసాయం వాతావరణం, తదితర అంశాలపై ఆధారపడి ఉన్నప్పటికీ కొంత భద్రత ఉంటుందని వారు నమ్ముతున్నారు.

మొత్తంగా చూస్తే... ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. కొత్త ఉద్యోగాల కల్పన అంతంతమాత్రంగానే ఉంటోంది. అరకొర వేతనాలు, అభద్రత కారణంగా యువత అనేక ఇబ్బందులు పడుతున్నారు. మెరుగైన వేతనాల కోసం తరచూ ఉద్యోగాలు మారుతున్న వారి సంఖ్య కూడా తక్కువగా ఏమీ లేదు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇస్తున్న అమృత్‌కాల్, అచ్చేదిన్ నినాదాలకు ఇది పూర్తిగా వాస్తవ దూరం.

దేశంలో 3,167 పులులున్నాయ్ !

- గణాంకాలు విడుదల చేసిన ప్రధాని మోడీ

మైసూరు : దేశంలో 3,167 పులులున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం నాడు ప్రకటించారు. ప్రాజెక్ట్ టైగర్ స్వర్ణోత్సవాల సందర్భంగా కర్ణాటకలోని మైసూరులో జరిగిన కార్యక్రమంలో పులుల గణన గణాంకాలను ఆయన విడుదల చేశారు. 2022లో దేశంలో పులుల సంఖ్య 3,167గా ఉందన్నారు. నివేదిక ప్రకారం పులుల సంఖ్య 2006లో 1,411, 2010లో 1,706, 2014లో 2,226, 2018లో 2,967, 2022లో 3,167కు చేరాయి.



ప్రాజెక్ట్ టైగర్ స్వర్ణోత్సవ సావనీర్‌ను విడుదల చేస్తున్న మోడీ, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్

ఈ సందర్భంగా 'అంతర్జాతీయ పులుల కూటమి (ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్స్ అలయన్స్ - ఐబిసిఏ)ని ప్రారంభించారు. ఈ ఐబిసిఏలో పులి, సింహంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఏడు రకాల పులుల పరిరక్షణపై దృష్టి సారిస్తుందన్నారు. పులుల సంరక్షణ కార్యక్రమం విజయానికి చిహ్నంగా రూ.50 స్మారక నాణాన్ని కూడా ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

40 శాతం కమిషన్ కాదు.. 100 శాతం నిబద్ధత కావాలి

- బిజెపిపై కాంగ్రెస్ నేత శశిథరూర్



బెంగళూరు : కర్ణాటకలో బిజెపి నాయకుల అవినీతిపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బెంగళూరులో ఆదివారం జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో '40 శాతం కమీషన్'పై ప్రజలు అలసిపోయారని.. వారు '100శాతం నిబద్ధత' కోరుకుంటున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆ నిబద్ధతను చాటుకుంటుందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే బెంగళూరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. 'గత నాలుగేళ్లుగా ఇక్కడ ఏమేరకు అభివద్ధి జరిగిందో చూశాం. చెడు ప్రభుత్వం ఉన్నప్పుడు అభివద్ధి అనేది ఎలా కనిపిస్తుంది. ప్రభుత్వ అవినీతి పాలనను చూసి ప్రజలే విస్తుపోతున్నారు' అని ఆయన పేర్కొన్నారు. కర్ణాటకలో కొంతకాలంగా ఇతర పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు కాంగ్రెస్‌లో భారీ స్థాయిలో చేరుతున్నారని శశిథరూర్ వెల్లడించారు. ఇటీవల ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, తమ పార్టీలో చేరడం చూస్తుంటే కాంగ్రెస్ విజయం అనివార్యమని తెలుస్తోందన్నారు.



'నందిని'కి హోటళ్ల మద్దతు

బెంగళూరు : కర్ణాటకలో అమూల్‌కు ఎదురు దెబ్బతగిలింది. కర్ణాటక పాడి ఉత్పత్తిదార్ల సహకార సంఘాల సమాఖ్య (కెఎంఎఫ్)కు చెందిన నందిని బ్రాండ్ పాలకు బెంగళూరు హోటల్స్ మద్దతు తెలిపాయి. నగరంలోని తమ హోటళ్లలో నందిని పాలు, పాల ఉత్పత్తులను మాత్రమే వినియోగిస్తామని హోటల్స్ యజమానులు ప్రకటించారు. కెఎంఎఫ్‌ను, రాష్ట్రంలోని పాడి రైతులను ఆదుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని బృహత్ బెంగళూరు హోటల్ అసోసియేషన్ (బిబిహెచ్ఎ) అధ్యక్షులు పిసి రావ్ చెప్పారు. ఇప్పటివరకు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసిన పాలను, నందిని పాలను ఉపయోగించామని, ఇకనుండి కాఫీ, స్నాక్స్ తయారు చేసేందుకు నందిని పాలు, పాల ఉత్పత్తులను మాత్రమే ఉపయోగిస్తామని వెల్లడించారు. వ్యాపార విస్తరణలో భాగంగా బెంగళూరులో తమ పాల ఉత్పత్తుల అమ్మకాలను ప్రారంభిస్తామని ఇటీవల గుజరాత్‌కు చెందిన అమూల్ సంస్థ ఓ ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే.

కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అమూల్ ప్రకటన రాజకీయ వివాదాలకు కేంద్రమైంది. కెఎంఎఫ్ బ్రాండ్ 'నందిని'ని నిర్వీర్యం చేసి, రాష్ట్రంలో పాల ఉత్పత్తుల వ్యాపారాన్ని అమూల్‌కు కట్టబెట్టాలని కేంద్రంలోని బిజెపి కుట్ర పన్నుతోందని, అందుకు రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం సహకరిస్తోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



రాజస్తాన్ కాంగ్రెస్‌లో మళ్లీ కలకలం

- దీక్ష చేపట్టనున్న సచిన్ పైలెట్

జైపూర్ : రాజస్తాన్ కాంగ్రెస్‌లో మళ్లీ కలకలం ప్రారంభమైంది. సొంత పార్టీపైనే సచిన్ పైలెట్ విమర్శల దాడికి దిగారు. గతంలో వసుంధర రాజే పాలనలో రాష్ట్రంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అశోక్ గెహ్లాట్ ప్రభుత్వం విఫలమైందని సచిన్ పైలెట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం ఒకరోజు నిరాహార దీక్షకు చేపట్టనున్నట్లు ప్రకటించారు. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి ఉందని ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని సచిన్ పైలెట్ అన్నారు. ఎక్సైజ్‌మాఫియా, అక్రమ మైనింగ్, భూ ఆక్రమణలు, లలిత్ మోడీ అఫిడవిట్ కేసుపై చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వీటిపై విచారణను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వసుంధరా రాజే హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వసుంధర రాజే పాలన వైఫల్యాలు, అవినీతిపై గెహ్లాట్ ఆరోపణలు చేస్తున్నట్లు కనిపిస్తోన్న వీడియోలను ఈ సందర్భంగా సచిన్ పైలెట్ ప్రదర్శించారు. వసుంధరా రాజే పాలనలోని అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉన్నాయని, అయినప్పటికీ వాటిపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ హామీలను నెరవేర్చకుండా ఎన్నికలకు వెళ్లలేమని పైలెట్ పేర్కొన్నారు. మరికొన్ని నెలల్లో రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. 2018లో రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినపుడు గెహ్లాట్, పైలెట్‌లు చెరో రెండున్నరేళ్లపాటు ముఖ్యమంత్రులుగా కొనసాగుతారని అధిష్టానం పేర్కొంది. కానీ పైలెట్‌కు ఆ అవకాశం దక్కకపోవడం గమనార్హం. అనంతరం గెహ్లాట్‌పై సచిన్ పైలెట్ పలుమార్లు తిరుగుబాటు ప్రకటించి అధిష్టానం బుజ్జగింపులతో సర్దుకుపోయిన సంగతి తెలిసిందే.

జయలలిత చరాస్తుల విక్రయానికి న్యాయవాది నియామకం

కర్ణాటక : అక్రమాస్తుల కేసులో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నుంచి స్వాధీనం చేసుకున్న చరాస్తులను విక్రయించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది. అక్రమాస్తులకు సంబంధించి 1996లో జయలలితపై కేసు నమోదైంది. సుప్రీంకోర్టు జోక్యంతో 2003లో ఈ కేసు తమిళనాడు నుంచి కర్ణాటకకు బదిలీ అయింది. సీబీఐ కేసుల్లో 2014లో ప్రత్యేక న్యాయస్థానం జయను దోషిగా తేల్చింది. ఈ కేసు సందర్భంగా 11 డిసెంబరు 1996లో చెన్నైలోని జయలలిత నివాసం నుంచి 7 కిలోల బంగారం/వజ్రాభరణాలు, 600 కేజీల వెండి ఆభరణాలు, 11 వేలకుపైగా చీరలు, 750 జతల పాదరక్షలు, 91 చేతి గడియారాలు, 131 సూట్‌కేసులు, 1,040 వీడియో క్యాసెట్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ఇతర విద్యుత్ పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వ అధీనంలో ఉన్నాయి. ఈ చరాస్తుల విక్రయానికి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఎస్-ఎస్‌పీ) అవసరమని పేర్కొంటూ కర్ణాటక హైకోర్టు రిజిస్ట్రార్‌కు అక్టోబరు 2022లో సీబీఐ లేఖ రాసింది. ఈ నేపథ్యంలో న్యాయవాది కిరణ్ ఎస్ జావళిని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎస్‌పీపీ)గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.


లక్ష్యానికి దూరంగా ప్రధాని జన్ ఆరోగ్య యోజన

న్యూఢిల్లీ : ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ఆరోగ్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2018 సెప్టెంబరులో ప్రారంభించిన ప్రధాని జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) లక్ష్యానికి దూరంగా నిలిచింది. ఆయుష్మాన్ భారత్ కింద దీనిని ప్రారంభించారు. యాభై కోట్ల మంది లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయల వరకూ ఆరోగ్య బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని నిర్దేశించుకున్నారు. అయితే బలహీన వర్గాల వారు ఈ పథకాన్ని ఉపయోగించుకోలేకపోతున్నారని లాన్సెట్ రీజనల్ హెల్త్‌లో ప్రచురితమైన నివేదిక ఎత్తిచూపింది. 2018-2022 మధ్యకాలానికి సంబంధించి దీనిని రూపొందించారు. దీని ప్రకారం... ఈ పథకం విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. పథకం గురించి తెలిసి కూడా నమోదు చేసుకున్న వారి సంఖ్య చాలా తక్కువ. అంటే బలహీన వర్గాల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రారంభించిన ఈ పథకం దానిని చేరుకోవడంలో విఫలమైంది.

ఉక్రెయిన్‌లో శాంతి చర్చలకు
అమెరికాయే అతిపెద్ద అడ్డంకి

- సోషల్ మీడియాలో లీకైన పెంటగాన్ పత్రాలు వెల్లడి

వాషింగ్టన్/మాస్కో: ఉక్రెయిన్ మిలిటరీ ఆపరేషన్‌కు సంబంధించిన అమెరికా, నాటో వ్యూహాన్ని బట్టబయలు చేసే రహస్య పత్రాలు సోషల్ మీడియాలో లీక్ అయిన విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ శుక్రవారం వెల్లడించింది. ఈ పత్రాలు ప్రస్తుతం అమెరికాలోని అతి పెద్ద సోషల్ మీడియా సంస్థలైన ట్విట్టర్, టెలిగ్రామ్ ప్లాట్‌ఫామ్‌లపై విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. రష్యాను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్‌ను అమెరికా, దాని మిత్ర దేశాలు ఎలా ఎగదోస్తున్నదీ, శాంతి చర్చలకు, రాజకీయ పరిష్కారానికి అమెరికా ఎలా మోకాలడ్డుతున్నదీ ఈ పత్రాలు వెల్లడించాయి. అదే సమయంలో రహస్య పత్రాలు లీకేజి వ్యవహారం అమెరికాకు, పశ్చిమ దేశాలకు, ఉక్రెయిన్‌కు మధ్య నెలకొన్న అనైక్యత, అపనమ్మకాలను, విభేదాలను కూడా బయటపెట్టిందని అంతర్జాతీయ నిపుణులు కొందరు వ్యాఖ్యానించారు. ఈ పత్రాలు నిజమైనవి కాదంటూనే దీనిపై డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్ దర్యాప్తునకు బైడెన్ ప్రభుత్వం ఆదేశించింది. ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతి చర్చలను ప్రోత్సహించేందుకు అంతర్జాతీయంగా జరుగుతున్న కృషికి అమెరికాయే ప్రధాన అడ్డంకి అని ఈ రహస్య పత్రాలు రుజువు చేస్తున్నాయి. అమెరికా తన విరోధులపైనే కాదు, చివరికి తన మిత్రులపై కూడా ఎలా గూఢచర్యానికి పాల్పడుతుందీ ఇప్పటికే ఎడ్వర్డ్ స్నోడెన్ 'ప్రిజమ్', అసాంజే 'వికీలీక్స్' స్పష్టంగా బయటపెట్టాయి. శుక్రవారం లీకైన పెంటగాన్ రహస్య పత్రాలు ఉక్రెయిన్ ఉన్నత సైనికాధికారులపైన, రాజకీయ నాయకులపైన ఎలా నిఘా పెట్టినదీ లోకానికి వెల్లడించాయి. లీక్‌అయిన పత్రాలు నిజమైన పత్రాల్లానే కనిపిస్తున్నాయని అమెరికన్ అధికారి ఒకరు సిఎన్‌బిసి న్యూస్‌కు తెలిపారు. సైనిక సరఫరాలు, గణాంక విశ్లేషణలు, కార్యాచరణకు సంబంధించిన వివరాల కన్నా కల్పిత సమాచారమే ఎక్కువగా ఉన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్ష సలహాదారు పోడో ల్యాక్ చెప్పారు. అమెరికా తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఉక్రెయిన్ సంక్షోభాన్ని ఉపయోగించుకుంటోందని ఈ పత్రాలు రుజువు చేస్తున్నాయని చైనాకు చెందిన నిపుణుడు ఒకరు వ్యాఖ్యానించారు.



సిరియాపై ఇజ్రాయిల్ ఫిరంగి దాడులు

డమాస్కస్: భూ కంపం సృష్టించిన విలయం నుంచి ఇంకా కోలుకోని సిరియాపై ఇజ్రాయిల్ ఆదివారం ఫిరంగుల వర్షం కురిపించింది. శనివారం రాత్రి ఇజ్రాయిల్ ఆక్రమిత గోలాన్ హైట్స్‌పై సిరియా రాకెట్ ఒకటి పడినందుకు ప్రతిగా తాము ఈ దాడులు చేశామని ఇజ్రాయిల్ తన చర్యను సమర్థించుకుంది. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జెరూసలెం పాత నగరంలోని అల్ అక్సా మసీదులో ప్రార్థనలు చేసుకుంటున్న పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ పోలీసులు దాడి చేసి బాష్ప వాయువు, రబ్బరు తొడుగుతో కూడిన ఇనుప బులెట్లను ప్రయోగించి, ఇష్టానుసారంగా కొట్టిన దృశ్యాలతో కూడిన మొబైల్ వీడియో పుటేజీలు సోషల్ మీడియాలో వైరల్ అవడంతో అరబ్ ప్రపంచం ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా, దాని మిత్ర దేశాలు సైతం ఇజ్రాయిల్ క్రూరత్వంపై ఆందోళన చెందాయి. ఈ నేపథ్యంలోనే సిరియా, లెబనాన్, ఇరాన్, ఇతర అరబ్ దేశాలు ఇజ్రాయిల్‌పై రాకెట్ దాడులు చేశాయి. వీటిలో చాలా వాటిని ఇజ్రాయిల్ వాయు రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. సిరియా ప్రయోగించిన ఆరు రాకెట్లలో ఒకటి గోలాన్ హైట్స్‌లో పడింది. దీనిని సాకుగా చూపి ఇజ్రాయిల్ సిరియాపై తీవ్ర స్థాయిలో దాడులకు పాల్పడింది. అయితే,ఈ దాడుల్లో ప్రాణ నష్టం, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు వెంటనే తెలియరాలేదు. ఈ దాడుల తరువాత పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. 1967 యుద్ధంలో గోలాన్ హైట్స్ ప్రాంతాన్ని ఇజ్రాయిల్ కబళించింది. 1981లో 1200 చ. కి.మీ పాసల్తీనా భూభాగాన్ని అది ఆక్రమించుకుంది.

జెరూసలెంలోని అల్ అక్సా మసీదు ముస్లింలకు, యూదులకు పవిత్రమైనది. అందుకే దీనిని టెంపుల్ మౌంట్ అని పిలుస్తారు. ఇజ్రాయిల్ దాడులతో ఇక్కడ తరచూఉద్రిక్తతలు చోటుచేసుకుంటుంటాయి. రంజాన్ , యూదుల పండగ పస్కా, క్రైస్తవుల ఈస్టర్ దగ్గర దగ్గరగా ఒకే సమయంలో రావడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. అల్ అక్సామసీదులో ముస్లిమేతరుల ప్రార్థనలపై ఉన్న నిషేధాన్ని ధిక్కరించిన యూదులను వదిలేసి, పాలస్తీనీయులపై పోలీసులు దాడి చేయడం ఇజ్రాయిలీ క్రూరత్వాన్ని తెలియజేస్తోంది.

అమెరికన్ అనుచరులుగా మారొద్దు

ఐరోపా దేశాలకు మాక్రాన్ హితవు

పారిస్: యూరోపియన్లు అమెరికన్ అనుచరులుగా మారొద్దని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ ఐరోపా దేశాలకు హితవు పలికారు. తైవాన్ పై అమెరికా అనుసరిస్తున్న ఘర్షణ వైఖరి నుంచి తాను విడగొట్టుకుంటున్నానని తెలిపారు. చైనా పర్యటనలో భాగంగా బీజింగ్‌లోని సన్‌యెట్‌సేన్ యూనివర్సిటీ విద్యార్థుల నుద్దేశించి ఇటీవల ఆయన మాట్లాడారు.అమెరికా రచించే పన్నాగంలో చిక్కుకోకుండా ఐరోపా దేశాలు 'వ్యూహ స్వయంప్రతిపత్తి' కలిగి ఉండాలని అన్నారు. మాక్రాన్ గతంలోనూ ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో అమెరికా ఘర్షణ వైఖరిని తానెన్నడూ అంగీకరించబోనని చెప్పారు.

మధ్యధరాలో కలుస్తున్న వలస ప్రాణాలు

ట్యునీషియా : మధ్యదరా సముద్రంలో శుక్ర, శనివారాల్లో జరిగిన వేర్వేరు పడవ మునక ఘటనల్లో నలుగురు మరణించగా, మరో 27 మంది గల్లంతయ్యారు. ఈ రెండు ఘటనల్లోనూ ఆఫ్రికన్ వలసదారులే బాధితులు. శుక్రవారం రాత్రి ట్యునీషియా తీరంలో ఓ పడవ మునిగిపోయింది. ఉత్తర ఆఫ్రికా నుండి మధ్యదర సముద్రం మీదుగా ఇటలీ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 20 మంది గల్లంతయ్యారు. శనివారం జరిగిన రెండో ఘటనలో..ట్యునీషియా నుంచి మధ్యధరా సముద్రం దాటి ఇటలీ వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు పడవ మునిగిపోవడంతో నలుగురు మరణించారు. మరో ఏడుగురు వరకు గల్లంతయ్యారు. ఇటీవల కాలంలో ట్యునీషియా తీరంలో పడవ ప్రమాదాలు ఎక్కువ అయ్యాయి. బాధితులందరు వలసదారులే.


తైవాన్ ద్వీపం చుట్టూ గస్తీ ముమ్మరం

- విన్యాసాల్లో విమాన వాహక నౌకలు, రాకెట్లు, ఫైటర్ జెట్లు, క్షిపణులు



బీజింగ్: తైవాన్ ద్వీపంపై తన ప్రాదేశిక సార్వభౌమత్వాన్ని సవాల్ చేసే ఎటువంటి యత్నాన్ని అయినా తిప్పికొట్టేందుకు చైనా సైనికంగా సంసిద్ధమవుతోంది. ద్వీపం చుట్టూ చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ)సైనిక విన్యాసాలను ముమ్మరం చేసింది. సైనిక సన్నద్ధతను చాటిచెప్పే డ్రిల్లులో యుద్ధ విమాన వాహక నౌకలు, సుదూర రాకెట్లు, ఫైటర్ జెట్లు, క్షిపణులు పాల్గొన్నాయి. 'జాయింట్ స్వోర్డ్' పేరుతో ద్వీపానికి నలువైపులా పిఎల్ఎ తూర్పు థియేటర్ కమాండో దళం విన్యాసాలను ముమ్మరం చేసినట్లు చైనీస్ సెంట్రల్ టెలివిజన్ చానెల్ (సిసిటివి) తెలిపింది. నిర్దేశిత లక్ష్యాలను క్షణాల్లో ఛేదించడం, సముద్ర భాగాన్ని, గగనతలాన్ని అదుపులోకి తీసుకుని, అడ్వాంటేజ్ పొజిషన్ తీసుకోవడంలో టాస్క్‌ఫోర్స్ సామర్థ్యాన్ని, సన్నద్ధతకు ఈ విన్యాసాలు ఒక పరీక్ష వంటివని సిసిటివి తెలిపింది.

చైనా మిలిటరీ అకాడెమీ సైన్స్ పరిశోధకుడు జావో సియారుువా గ్లోబల్ టైమ్స్‌తో మాట్లాడుతూ, పెద్దయెత్తున నిర్వహిస్తున్న జాయింట్ కమాండో విన్యాసాల్లో చైనా ఆర్మీకి సంబంధించిన అన్ని విభాగాల సాయుధ సంపత్తిని ప్రదర్శిస్తున్నారని అన్నారు. బయటి శక్తులు ఏవైనా దాడి చేసేందుకు యత్నించిన పక్షంలో సమాచారం, కమ్యూనికేషన్ నెట్‌వర్కుపై అదుపు, రాడార్ పై ఎలక్ట్రానిక్ సప్రెషన్ నిర్వహించడం, తైవాన్‌లోని యాంటీ మిస్సైల్స్ స్థావరాలపై పట్టు సాధించడం ఇదే ఈ డ్రిల్లు ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు.




మీకోసం

కూరలో ఉప్పు ఎక్కువైతే.. కొంచెం బియ్యం పిండిని నీటిలో కలిపి దాన్ని కూరలో వేసి రెండు నిమిషాలు ఉడికించాలి.

జీవన సౌరభం

పొరపాట్లు సహజమంటూ ప్రతిసారీ ఉపేక్షిస్తే అది అలవాటుగా మారే ప్రమాదముంటుంది.

పర్యావరణం



వనాల్ని మనం పెంచుకుందాం
భవిష్యత్తును సంరక్షించుకుందాం

తరతరాలుగా
ఈ తరువులే
మనకు కల్పతరువులూ
తరువులే జనావళికి
సిరి సౌరుగులూ

తీపి చెరుకై
వంట చెరుకై
ఇంటి వంటై
పంటి కింపగు ఆహారమై
ఆధారమూ
ఔషధమూలికౌ


ఆరోగ్యమిచ్చు
పండ్లు తెచ్చు
నీడ నిచ్చు
ఆకుపచ్చదనంతో జన
ఆయుష్షు హెచ్చు

ఓజోన్ భూమికి
రక్షణ కవచం
హానికర రసాయనాల నుండి
కాపాడుకుందాం

కాలుష్య కారకం
ప్లాస్టిక్ భూతం
నేల తల్లికి ఘాతం
గాలి నీరునూ మనం
ఉంచుకుందాం సురక్షితంగా

- డా చిట్యాల రవీందర్
77988 91795

ఖాళీలు పూరించండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ





పిసిపాటి రిషిక్ జాన్సన్,
యుకేజీ,
సిద్ధార్థ పబ్లిక్ స్కూలు,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒకరికొకరం అనుకోవడమే బలగం



ఇప్పటి రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు చాలా తక్కువ. కుటుంబంలో ఉన్న ఐదుగురు, ఆరుగురుల్లోనూ ఎవరికి వారై అన్నట్లు ఉంటున్నారు. ఒకరికొకరం అన్న భావన తగ్గిందని సర్వేల్లో వెల్లడవుతోంది. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు పెరగాల్సిన అవసరం చాలా ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

- చాలా కుటుంబాల్లో భార్య భర్తలు రోజంతా పని చేస్తూ ఐదు, పది నిమిషాలైనా తీరగ్గా మాట్లాడుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఇలాగే కొనసాగిస్తే ఒకరిపట్ల మరొకరికి అసహనం ఏర్పడుతుంది. అందుకే తీరక దొరికినప్పుడల్లా జీవిత భాగస్వామితో మాట్లాడుతూ ఉండాలి. పిల్లల చదువు, ఇతర అవసరాల గురించి చర్చించుకోవాలి. అలాగే ఇంట్లో పెద్దవారి పట్ల ప్రేమగా మసలుకోవాలి. లేకుంటే ఇంట్లో ఉన్న పెద్దలు ' ఒంటరిగా ఫీలయ్యే అవకాశం ఉంది. వారికి తామున్నామని ధైర్యాన్నిస్తూ ఉండాలి.
- పాత తరానికి, ఇప్పటి తరం పిల్లలకు ఆలోచనల్లో తేడాలుంటాయి. ఈ క్రమంలో నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యల అభిప్రాయాలను పిల్లలు తోసిపుచ్చడం జరుగుతూ ఉంటుంది. దాంతో తమను చిన్నతనంగా చూస్తున్నారని పెద్దలు ఫీలయ్యే ప్రమాదం ఉంది. అందుకే కాలానుగుణంగా పరిస్థితులను అర్థం చేసుకుంటూ, సమాజం ఎలా ఉందో– ఇటు పిల్లలకు, తల్లిదండ్రులకు వివరించాల్సిన బాధ్యత భార్యభర్తలకు ఉంది. అప్పుడే కుటుంబ సభ్యుల మధ్య సదావగాహన ఏర్పడుతుంది.
- కుటుంబానికి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఏదైనా సమస్య వచ్చినప్పుడు తప్పకుండా ఇంట్లో వారి అభిప్రాయం తీసుకోవాలి. ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవడం మంచి పద్ధతి కాదు. దీనివల్ల మిగిలిన సభ్యుల దగ్గర విలువ తగ్గుతుంది.
- కుటుంబ సభ్యుల్లో ఎవరైనా బయటి నుంచి వేధింపులకు గురైనా, సమస్యలను ఎదుర్కొన్నా మిగతా కుటుంబ సభ్యులు అండగా నిలవాలే తప్ప మరింత బాధపడేలా ప్రవర్తించకూడదు. అప్పుడే సభ్యుల మధ్య ఒకరి పట్ల మరొకరికి నమ్మకం, ప్రేమా పెరుగుతాయి.
- అత్తా–కోడలు, మామ– అల్లుడు, తాత– మనవడు, మనవరాళ్ల మధ్య చిన్న చిన్న అభిప్రాయ బేధాలు వస్తూ ఉంటాయి. వీటిని ఆసరాగా తీసుకుని బయట వ్యక్తులు మీ దగ్గర ప్రస్తావన చేస్తున్నప్పుడు వారికి ఆ అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడాలి. లేకుంటే సమస్య పెద్దది అవుతుంది. అప్పుడే బంధాలకు మీరెంత విలువ ఇస్తున్నారో అవతలి వ్యక్తికి నిదానంగానైనా తెలుస్తుంది.
- ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకేలా ఉండవు. ఇబ్బంది కలిగించనంతవరకూ వాటిని గౌరవించటంలో ఇబ్బంది లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మెసులుకుంటే కుటుంబసభ్యుల మధ్య గొడవలు రావు.
- అందరూ కలిసి విహారయాత్రలకు వెళ్లడం, సెలవు రోజుల్లో అందరూ ఒకే చోట కూర్చుని భోజనం చేయడం, ఏదైనా విషయం మీద కలిసి చర్చించడం, దూరంగా ఉన్న తోబుట్టులను ఫోన్ చేసి యోగాక్షేమాలు కనుక్కోవడం చేస్తూ ఉంటే కుటుంబ సభ్యుల మధ్య బంధాలు బలపడతాయి. ప్రేమానురాగాలు పెరుగుతాయి అంటున్నారు మానసిక నిపుణులు.

మునగాకు మంచిది మనకు



కొన్ని రకాల మొక్కలు అటు ఆహారంగా, ఇటు ఆరోగ్యపరంగా ఎంతో తోడ్పడతాయి. వాటిలో మునగ చెట్టు ఒకటి. ఈ చెట్టు కాయలతో పాటు ఆకు, పూతలో ఎన్నో పోషకాలు ఉన్నాయి.

- ఎండాకాలంలో వచ్చే లేత మునగ ఆకుల్లో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుంది. దాంతో ఈ కాలంలో వచ్చే జలుబు, దగ్గులాంటివి దరి చేరవు. పుండ్లు, ఇన్ఫెక్షన్లు తగ్గిపోతాయి.
- పాలకూరతో పోలిస్తే ఈ ఆకులో మూడు రెట్లు ఐరన్ లభిస్తుంది. అరటిపండు కంటే ఏడు రెట్లు మెగ్నీషియం లభిస్తుంది. ప్రోటీన్లు ఉంటాయి. దీన్ని తరచూ పప్పుతో లేదా వేపుడు రూపంలో తీసుకుంటే మంచిది.
- మునగలో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల కాస్త తినగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. శరీరంలో కొవ్వు పదార్థాలు తగ్గటానికి దోహదపడుతుంది.
- దీనిలో ఉండే క్లోరోజనిక్ చెడు కొవ్వును కరిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. శరీరంలో వ్యర్థాలను బయటకు పంపడంలో సాయపడుతుంది.
- మునగాకులో విటమిన్ ఎ చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. దీనిలో ఉండే అమైనో ఆమ్లాలు ప్రోటీన్ ఉత్పత్తికి తోడ్పడతాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరుస్తాయి.

ఎండల్లో పిల్లల సంరక్షణ ఇలా..



పిల్లలు ఇంకా స్కూలుకు వెళుతున్నారు. ఒక పక్క ఎండలు మండిపోతున్నాయి. దీంతో శరీర ఉష్ణోగ్రతలు పెరగటం, నీరసం, వడబెబ్బకు గురికావటం వంటివి ఎక్కువగా జరుగుతుంటాయి. పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఈ కాలంలో కొన్ని జాగ్రత్తలను కచ్చితంగా పాటించాలి.

సాధారణంగానే పిల్లలు నీళ్లు ఎక్కువగా తాగరు. గంటల తరబడి అలాగే ఉంటారు. కాని తరచూ నీళ్లు తాగమని చెప్పాలి. ఈ అలవాటు వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్ స్థాయి క్షీణించదు.

- హైడ్రేట్‌గా ఉండాలంటే కొబ్బరి నీరు, పండ్ల రసాలు, సిట్రస్ పండ్లు, మజ్జిగ, నిమ్మకాయ నీరు, పండ్ల స్మూతీస్ వంటివి ఇవ్వాలి.
- అధిక ఉష్ణోగ్రతకు తాళలేక పిల్లలు శీతల పానీయాలు తాగేందుకు సిద్ధపడతారు. దానివల్ల వారు తరచూ అనారోగ్యం పాలవుతారు. శరీర ఉష్ణోగ్రత పెరగడం, ఎక్కువ చెమటలతో శరీరంలో నీరు త్వరగా ఆవిరై వడదెబ్బకు దారితీస్తుంది.
- ఎండ సమయంలో పిల్లలకి కథలు చెప్తూ, రైమ్స్, పాటలు పాడిస్తూ, పుస్తకాలు చదివిస్తూ, బొమ్మలు వేయిస్తూ, ఇంట్లో ఆడుకునే ఆటలు ఆడుకునేలా చూసుకోవాలి.
- కొబ్బరినీళ్లు, బార్లీ, సబ్జా, సగ్గుబియ్యం వంటి ద్రవాలు తాగించాలి. సీజనల్ ఫ్రూట్స్‌తో పాటు అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు తినిపించాలి.
- రెండు పూటలా గోరువెచ్చని నీటితో స్నానం చేయించాలి. శరీరంలో ఎక్కువ వేడి ఉన్నట్టయితే తడిబట్టతో తుడుస్తుండాలి.
- ఇంట్లోకి వేడిగాలి నేరుగా చొచ్చుకు రాకుండా చుట్టూ మ్యాట్‌లు వేలాడదీయాలి. ఇవి పూర్తిగా తడి ఆరిపోకుండా చూసుకోవడం వల్ల గదులన్నీ చల్లని వాతావరణాన్ని కలిగి ఉంటాయి.
- పిల్లలకు పలుచటి, మెత్తటి కాటన్ దుస్తులు వేయాలి. బయటికి వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ, తప్పకుండా ధరించాలి.
- ఉదయం టిఫిన్ తిన్న తరువాత నిమ్మకాయ రసం, ఖర్జూరం ఇస్తే జీర్ణశక్తి పెరుగుతుంది.
- పిల్లలు డీహైడ్రేషన్‌కి లోనయినట్టు అనిపించినప్పుడు ఉప్పు, పంచదార కలిపిన నీరు తాగించాలి.

ఎందుకింత హింస?



మంచి కథతో పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు ఇప్పుడున్న యువ హీరోలు. కాని ఆ స్థాయిలో కూడా టాలీవుడ్ ముద్ర ఉండేలా హింస, చంపడం, తీవ్రమైన పగ, ప్రతీకారాలు, బీభత్సమైన పోరాట దృశ్యాలూ ఉంటున్నాయి. దీంతో కథ కన్నా ప్రేక్షకుడి మైండ్‌లో ఈ హింసాధోరణే గుర్తిండిపోతుంది. అందుకు ఇటీవల విడుదలైన దసరా, రావణాసుర సినిమాలే నిదర్శనం. అనవసరమైన హింస వల్లే వీటి రేటింగ్ తగ్గిందని విశ్లేషకుల అభిప్రాయం. ఇటువంటి సినిమాలు అభిమానులు మెచ్చినా ప్రేక్షకులు మాత్రం కోరుకోవడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో వాస్తవాలకు దగ్గరగా, సామాజిక అంశాలు ప్రతిబింబేలా ఉంటేనే జనం మెచ్చుతున్నారని చిన్న సినిమాల పరంపర కనిపిస్తున్నా దర్శక, నిర్మాతల్లో మాత్రం మార్పు ఉండటం లేదు.



వీర్లపల్లి అనే ఊరిలో సింగరేణి బొగ్గుగనుల కథ నేపథ్యంలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల 'దసరా' చిత్రాన్ని తీశారు. స్థానిక రాజకీయ నాయకులు ఆ ఊరి జనం జీవితాలతో ఎలా ఆడుకుంటారో చెప్పారు. హీరోయిన్ కీర్తి సురేష్ వెన్నెల పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయి నటించింది. గేదెలు, గొర్రెలు, కోళ్లతో నివాసం ఉంటున్న ఓ పల్లెటూరు అమ్మాయిగా సహజత్వం ఉట్టిపడేలా చేసింది. సినిమా చూస్తున్నంత సేపూ ఒకప్పటి గ్రామీణ దృశ్యాలు కళ్లల్లో మెదులుతాయి. మేకర్స్ టెక్నికల్ అంశాలు, సంగీతం మీద పెట్టిన దృష్టి కథ మీదా పెట్టి ఉంటే బాగుండేది. విలన్‌పై పగను తీవ్రస్థాయిలో పెంచుకుంటూ హీరో చేసిన హత్యలు, హింస ఎక్కువ. అంశం వేరుగా ఉన్నా కథలో మాత్రం కొత్తదనం కనిపించలేదు.

రవితేజ అంటే మాస్ హీరో, ఫ్యామిలీ ఆడియన్స్ ఇష్టపడే నటుడు. సస్పెన్స్ క్రైం థ్రిల్లర్ నేపథ్యంలో 'రావణాసుర' తీశాడు. ఇందులో నెగిటివ్ కోణమే ఎక్కువగా కనిపిస్తుంది. నరరూప రాక్షసుడిగా కనిపిస్తూ ఎక్కడా ప్రేక్షకులను హత్తుకునే సీన్లు లేవు. అక్కడక్కడ థ్రిల్లింగ్ అనిపించినా సరైనా డైలాగులు లేవు. యువతిని మెడ కోసి చంపే దృశ్యాలు, అమ్మాయిల మీద పడి రేప్ చెయ్యడాలు చూపించారు. ఇవన్నీ ప్రేక్షకులే కాదు అభిమానులూ మెచ్చరు. ఫ్యామిలీ ఆడియన్స్‌ని దూరంగా పెట్టే సినిమాగా ఇది నిలిచిపోతుంది. ఈ సినిమా మీద పెట్టుకున్న అంచనాలు తలకిందులు చేసినట్లు అనిపించింది. ఇందులో ఆయన నటన రవితేజలోని మరో కోణాన్ని చూపించింది. డ్యాన్సులు అద్భుతంగా ఉన్నాయి.



ఇటువంటి హింస ఎక్కువగా బాలకృష్ణ–బోయపాటి శీను సినిమాల్లో కనిపించేది. మొదట్లో ఎంటర్టైన్‌గా అనిపించినా... పదే పదే ఇటువంటి అంశాలు చూపించడం వల్ల చూసేవారికి బోరింగ్‌గా అనిపిస్తుంది. యూత్ మీద తప్పకుండా ప్రభావం చూపుతుంది. చాలా సినిమాల్లోని సన్నివేశాలు హత్యలు, దొంగతనాలు ఎలా చేయాలో చూపిస్తున్నట్లు ఉంటున్నాయి. ఈ మధ్యకాలంలో యువతలో నేరపవృత్తి పెరిగిందని విశ్లేషకులు అంటున్నారు. అందుకే ఇటువంటి సీన్లు తగ్గించాలి.

చిత్రపరిశ్రమ అంటే ప్రయోగాలకు అడ్డా. రకరకాల కోణాల్లో నుంచి కథలు రాసుకుని సినిమాలుగా తీయొచ్చు. కొత్త అంశంతో, మనిషి జీవితానికి దగ్గరగా ఉండే అంశాలు– ప్రేక్షకుడి దృష్టికోణంలో నుంచి తీస్తే తప్పకుండా జనాదరణ పొందుతాయి. అందుకు బలగం సినిమానే నిదర్శనం. చిన్న పల్లెటూరులో కుటుంబంలో సభ్యుల మధ్య ప్రేమ–సంఘర్షణలో నేపథ్యంలో ఈ సినిమా నడిపారు. ఇందులో ఎటువంటి ఫైట్లూ లేవు. ఈ చిత్రానికి అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చాయి.

కరోనా తర్వాత పరిస్థితులు పూర్తిగా మారాయి. ప్రేక్షకుల అంచనాలు పెరిగాయి. దీన్ని గ్రహించిన తమిళ, మలయాళం పరిశ్రమలు సమాజాన్ని ప్రభావితం చేసిన అంశాలను కథలుగా ఎంచుకుని సినిమాలు తీస్తున్నాయి. దాంతో ఆ హీరోలు అన్నిచోట్లా అభిమానులను సంపాదించుకుంటున్నారు. కాని తెలుగులో మంచి పేరు, అనుభవం ఉన్న దర్శక, నిర్మాతలే పేలవమైన, మూసధోరణిలో హింసను ఎంచుకుంటూ కథలను చిత్రీకరిస్తున్నారు. సినిమా కొత్తదనంపై మేకర్స్ మరింత కసరత్తు చేయాలి. సమాజంలో మనిషి తన జీవనం కోసం పడుతున్న తపన, తన చుట్టూ ఉన్న పరిమితులు, సంఘర్షణలు, మానవ సంబంధాలూ వంటి అంశాలతో సృజనాత్మక కథలను ఎంచుకోవాలి. మనసుకు హత్తుకునే కథలను మన ప్రేక్షకులు ఎప్పుడూ నెత్తిన పెట్టుకుంటారు.

రింకూ 'సింగం'

- **ఛేదనలో సంచలన ఇన్నింగ్స్**
- **రషీద్ ఖాన్ హ్యాట్రిక్ వృథా**
- **టైటాన్స్‌పై నైట్‌రైడర్స్ గెలుపు**



రింకూ సింగ్ (48 నాటౌట్, 21 బంతుల్లో 1 ఫోర్, 6 సిక్స్‌లు)

అహ్మదాబాద్ : రింకూ సింగ్ (48 నాటౌట్, 21 బంతుల్లో 1 ఫోర్, 6 సిక్స్‌లు) అద్వితీయ ఇన్నింగ్స్‌తో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. గుజరాత్ టైటాన్స్‌పై కోల్‌కత నైట్‌రైడర్స్‌ను 3 వికెట్ల తేడాతో గెలిపించాడు. ఆశల్లేని మ్యాచ్‌లో గ్రౌండ్‌కు నలువైపులా వరుసగా ఐదు సిక్సర్లు సంధించి కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఊహించని విజయాన్ని కట్టబెట్టాడు. 205 పరుగుల భారీ ఛేదనలో వెంకటేశ్ అయ్యర్ (83, 40 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), నితీశ్ రానా (45, 29 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. 16 ఓవర్ల వరకు మ్యాచ్ కోల్‌కత చేతుల్లో ఉండగా.. రషీద్ ఖాన్ (3/37) హ్యాట్రిక్ వికెట్లతో టైటాన్స్ పట్టు బిగించింది. చివరి ఓవర్లో యశ్ దయాల్‌పై రింకూ సింగ్ విశ్వరూపంతో ఐపీఎల్ చరిత్రలోనే మునుపెన్నడూ ఎరుగని ముగింపు అభిమానులను ఆస్వాదించారు. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌కు ఇది తొలి ఓటమి కాగా.. కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఇది రెండో విజయం. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ సాయి సుదర్శన్ (53, 38 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), విజయ్ శంకర్ (63 నాటౌట్, 24 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) రాణించటంతో 20 ఓవర్లలో 4 వికెట్లకు 204 పరుగుల భారీ స్కోరు చేసింది. టైటాన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య గైర్హాజరీలో రషీద్ ఖాన్ సారథ్యం వహించాడు. రింకూ సింగ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

రింకూ అద్భుతం :

భారీ ఛేదనలో కోల్‌కతకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్లు గుర్బాజ్ (15), జగదీశన్ (6) ఆరంభంలోనే విఫలమయ్యారు. ఈ సమయంలో వెంకటేశ్ అయ్యర్ (83), కెప్టెన్ నితీశ్ రానా (45) మూడో వికెట్‌కు 100 పరుగులు జోడించారు. ఈ ఇద్దరు మెరవటంతో ఛేదనలో నైట్‌రైడర్స్ లక్ష్యం దిశగా సాగింది. అర్థ సెంచరీ ముంగిట రానా అవుటైనా.. రింకూ సింగ్ తోడుగా అయ్యర్ అదరగొట్టాడు. ఐదు సిక్సర్లు, ఎనిమిది ఫోర్లతో అయ్యర్ చెలరేగాడు. అతడు క్రీజులో ఉండగా టైటాన్స్ బౌలర్లు చేష్టలుడిగారు. భారీ షాట్‌కు వెళ్లి అయ్యర్ అవుట్ కాగా.. రషీద్ ఖాన్ హ్యాట్రిక్ వికెట్ల వేటతో కోల్‌కత ఆశలు ఆవిరయ్యాయి. రసెల్ (1), నరైన్ (0), శార్దుల్ (0) నిష్క్రమణతో టైటాన్స్ గెలపు లాంఛనం చేసుకుంది. చివరి ఆరు బంతుల్లో 29 పరుగులు అవసరం కాగా.. ఎవరూ కోల్‌కత నుంచి పోరాటం ఊహించలేదు. తొలి బంతికి ఉమేశ్ యాదవ్ సింగిల్‌తో రింకూ సింగ్‌కు స్ట్రయిక్ ఇవ్వగా.. చివరి ఐదు బంతులను స్టాండ్స్‌లోకి పంపించిన రింకూ అద్భుతమే చేశాడు. 20 ఓవర్లలో 7 వికెట్లకు 207 పరుగులు చేసిన కోల్‌కత 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

రాణించిన సాయి, శంకర్ :

తొలుత బ్యాటింగ్ చేసిన టైటాన్స్ భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (39), సాహా (17) శుభారంభం అందించారు. సాయి సుదర్శన్ (53), విజయ్ శంకర్ (63 నాటౌట్) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. సాయి, శంకర్ మెరుపులతో టైటాన్స్ 204 పరుగులు చేసింది. పవర్‌ప్లేలో గిల్.. మిడిల్ ఓవర్లలో సాయి సుదర్శన్, డెత్ ఓవర్లలో విజయ్ శంకర్ టైటాన్స్ పరుగుల వేటకు సారథ్యం వహించారు. డెవిడ్ మిల్లర్ (2 నాటౌట్) అజేయంగా నిలిచాడు. కోల్‌కత స్పిన్నర్ సునీల్ నరైన్ (3/33) మూడు వికెట్లు తీసుకున్నాడు.

సన్‌రైజర్స్ బోణీ

- **పంజాబ్‌పై హైదరాబాద్ గెలుపు**
- **రాణించిన త్రిపాఠి, మార్క్రరం**



రాహుల్ త్రిపాఠి

హైదరాబాద్ : సన్‌రైజర్స్ హైదరాబాద్ బోణీ కొట్టింది. ఐపీఎల్16లో తొలి విజయం నమోదు చేసింది. ఉప్పల్ స్టేడియంలో ఆదివారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 143 పరుగుల స్వల్ప ఛేదనలో రాహుల్ త్రిపాఠి (74 నాటౌట్, 48 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ ఎడెన్ మార్క్రరం (37 నాటౌట్, 21 బంతుల్లో 6 ఫోర్లు) మెరవటంతో సన్‌రైజర్స్ సులువుగా గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులు చేసింది. స్పిన్నర్ మయాంక్ మార్కండె (4/15) మాయజాలానికి తోడు మార్కో జాన్సెన్ (2/16), ఉమ్రాన్ మాలిక్ (2/32) నిప్పులు చెరగటంతో పంజాబ్ కింగ్స్ ఓ దశలో 88/9తో స్వల్ప స్కోరుకే కుప్పకూలే ప్రమాదంలో పడింది. ఆ జట్టు కెప్టెన్ శిఖర్ ధావన్ (99 నాటౌట్, 66 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటరి పోరాటంతో పంజాబ్ కింగ్స్‌కు మెరుగైన స్కోరు అందించాడు. మూడు మ్యాచుల్లో హైదరాబాద్‌కు ఇది తొలి విజయం కాగా, పంజాబ్ కింగ్స్ మూడు మ్యాచుల్లో ఇది తొలి ఓటమి.

రాణించిన రాహుల్ : 144 పరుగుల స్వల్ప ఛేదనలో హైదరాబాద్‌కు మంచి ఆరంభం దక్కలేదు. ఓపెనర్లు హ్యారీ బ్రూక్ (13), మయాంక్ అగర్వాల్ (21) నిరాశపరిచారు. 45/2తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆత్మరక్షణలో పడింది. ఈ సమయంలో జతకట్టిన రాహుల్ త్రిపాఠి (74 నాటౌట్), ఎడెన్ మార్క్రరం (37 నాటౌట్) మూడో వికెట్‌కు అజేయంగా 100 పరుగులు జోడించారు. క్రీజులో కుదురుకునేందుకు సమయం తీసుకున్న రాహుల్ త్రిపాఠి.. ఆ తర్వాత బౌండరీలతో చెలరేగాడు. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో సీజన్లో హైదరాబాద్ తరఫున తొలి అర్థ సెంచరీ సాధించాడు. మార్క్రరం సైతం ఆరు బౌండరీలతో మెరవటంతో మరో 17 బంతులు మిగిలి ఉండగానే సన్‌రైజర్స్ లాంఛనం పూర్తి చేసింది. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ సింగ్, రాహుల్ చాహర్ చెరో వికెట్ తీసుకున్నారు.



ధావన్

ధావన్ ఒక్కడే : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్‌కు సన్‌రైజర్స్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే వికెట్ల వేటకు తెరలేపిన హైదరాబాద్.. క్రమం తప్పకుండా వికెట్లు కూలగొట్టింది. భువి, జాన్సెన్ విజృంభణతో పవర్‌ప్లే అనంతరం 41/3తో నిలిచిన పంజాబ్ కింగ్స్‌ను మిడిల్ ఓవర్లలో స్పిన్నర్ మయాంక్ మార్కండె (4/15) మాయ చేశాడు. శామ్ కరణ్ (22), షారుక్ ఖాన్ (4), రాహుల్ (0), ఎలిస్ (0) వికెట్లతో మాయజాలం ప్రదర్శించాడు. ఉమ్రాన్ మాలిక్ సైతం మెరవటంతో 88 పరుగులకే పంజాబ్ 9 వికెట్లు కోల్పోయింది. కానీ కెప్టెన్ శిఖర్ ధావన్ (99 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. పదో వికెట్‌కు అజేయంగా 55 పరుగులు జోడించిన ధావన్.. 66 బంతుల్లో 12 ఫోర్లు,5 సిక్సర్లతో పంజాబ్‌కు పోరాడగలిగే స్కోరు అందించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68